## బీఆర్ఎస్‌కు మరో షాక్..

హైదరాబాద్,బీఆర్ఎస్ నుంచి వలసలు కంటిన్యూ అవుతన్నాయి. ఇప్పటికే చాలా మంది నేతలు అధికార కాంగ్రెస్, బీజేపీ వైపు వెళ్లిపోయారు.. ఇంకా వెళ్లిపోతున్నారు కూడా. తాజాగా ఈ జాబితాలోకి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి కూడా చేరిపోయారు. మంగళవారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో ఆయన భేటీ అయ్యారు. ఆయన నుంచి క్లారిటీ రావడంతో రేపో మాపో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది. మదన్‌రెడ్డి పార్టీ మారడం వెనుక కారణాలు చాలానే ఉన్నాయని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మెదక్ ఎంపీ సీటు ఇస్తామని బీఆర్ఎస్ హామీ ఇచ్చిందట. ఇటీవల వెల్లడించిన జాబితాలో ఆయనకు కాకుండా వెంకట్రామిరెడ్డిని అభ్యర్థిగా ప్రకటించడంతో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారట. ఈ కారణంగానే ఆయన కారు నుంచి దిగిపోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్నారు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి. తన అనుచరులతో మంతనాలు కూడా సాగించారని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కేడర్ నిలబడాలంటే పార్టీ మారడడమే బెటరని సంకేతాలిచ్చినట్టు చెబుతున్నారు.

# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :37 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 28-03-2024 | పేజీలు:4 వెల: 2.00

## గులాబీ బాస్ కు సింగరేణి షాక్..



హైదరాబాద్,అలాంటి కేసీఆర్ కు గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి అంతా మారిపోయింది. అధికారంలో ఉన్నప్పుడు అందరూ బంధువులు.. స్నేహితులే. కానీ.. ఒక్కసారి చేతిలో ఉన్న అధికారం చేజారితో లెక్కలు మారిపోతాయి. సమీకరణాల్లో తేడాలు వెలుగు చూస్తాయి. సుదీర్ఘ రాజకీయ జీవితంలో గులాబీ బాస్ కు ఎత్తుపల్లాల గురించి ఎవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కాకుంటే.. గడిచిన పదేళ్లలో ఆయన ఏం అనుకుంటే అదే జరిగేది. కాలం సైతం ఆయన్ను పరీక్షించలేదు సరికదా.. ఆయనే కాలానికి పరీక్ష పెట్టారన్న మాట వినిపించేది. అలాంటి కేసీఆర్ కు గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నుంచి అంతా మారిపోయింది. కలలో కూడా ఊహించని ఓటమి ఎన్నికల్లో ఎదురుకావటమే కాదు.. అధికారం చేజారింది. కాంగ్రెస్ పార్టీకి విజయం వరించింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అయినప్పటికీ మహా అయితే నెల చాటు ప్రభుత్వం పడిపోవటానికి అన్న ధీమాతో మొదలైన ఎదురుదెబ్బలు.. ఒకటి తర్వాత ఒకటి చొప్పున తగులుతూనే ఉన్నాయి. చూస్తుండగానే వంద రోజులు గడిచిపోయాయి. ఏం చేస్తాడులే అన్న రేవంత్ రెడ్డి ఒక్కొక్కటి చేసుకుంటూ పోతున్నారు. అదే సమయంలో బీఆర్ఎస్ లో లుకలుకలు మొదలయ్యాయి. ఊహించని పరిణామాలు.. అంచనాలకు మించిన నష్టాలు ఎదురవుతున్నాయి. గులాబీ బాస్ కుమార్తె కవితను ఈడీ అరెస్టు చేయటం మొదలు.. కలలో కూడా పక్కకు వెళ్లరనుకున్న పలువురు నేతలు కారు నుంచి వీడిపోవటం లాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఒకప్పుడు ఎన్నికలు వస్తే.. అభ్యర్థుల రేసులో కుప్పలు కుప్పలుగా ఉండే స్థాయి నుంచి మీరు పోటీ చేయాలని గులాబీ బాస్ కోరినా.. సారీ.. ఆ పని మాత్రం చేయలేమంటూ ముఖానే చెప్పేసే దుస్థితి. ఇన్ని ఎదురుదెబ్బల వేళ.. మరో ఎదురుదెబ్బ తాజాగా తగిలింది. కీలకమైన పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలింది. సింగరేణి బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఇకపై తాను బీఆర్ఎస్ తో కలిసి అడుగులు వేయనని తేల్చి చెప్పింది. తమకు కారు పార్టీతో సంబంధాలు తెగిపోయిన వైనాన్ని వెల్లడించింది. గులాబీ పార్టీతో తాము తెగతెంపులు చేసుకున్నట్లుగా పేర్కొన్నారు. ఇకపై తాము స్వతంత్రంగా వ్యవహరిస్తామన్న విషయాన్నిఅధికారికంగా ప్రకటించారు. సింగరేణి బొగ్గు గనుల కార్మిక సంఘం దూరమైన నేపథ్యంలో వరంగల్.. పెద్దపల్లి.. అదిలాబాద్.. ఖమ్మం ఎంపీ స్థానాలకు జరిగే ఎన్నికల్లో సింగరేణి కార్మికుల ఓట్లు దూరం కానున్నాయి. ఇప్పటికే వరుస షాకులతో కిందా మీదా పడుతున్న పెద్ద సారుకు సింగరేణి కార్మిక సంఘం నుంచి తగిలే షాక్ మరింత భారీగా ఉండటమే కాదు..కీలక ఎన్నికల్లో విజయవకాశాల్ని తగ్గించేస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## కవిత అరెస్టుపై స్పందించిన మంత్రి కొండా..



హైదరాబాద్,ఎమ్మెల్సీ కవిత అరెస్టుపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఇవాళ వరంగల్ జిల్లాలో పర్యటనలో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కవితను అరెస్టు చేయడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు అని తెలిపారు.తెచ్చుకున్న తెలంగాణకు న్యాయం చేయకుండా కేవలం కల్వకుంట్ల కుటుంబం మాత్రం బాగుపడింది ఆరోపించారు. అందుకే వారి కుటుంబానికి తగిలే దెబ్బలు ప్రజలందరూ స్వీకరిస్తున్నారు. అలాగే, కాళేశ్వరం, మేడిగడ్డ విషయంలో కూడా బీజేపీ ప్రభుత్వం మాట్లాడకుండా ఉంది అంటే ఆరోజు మెగా వాళ్ళు కోట్ల రూపాయలు ఇస్తున్నారన్నారు. ఇక, వరంగల్ నగరంలో గతంలో మునిగిపోయింది.. త్వరలో బొంది వాగు ప్రాజెక్ట్ ఫండ్ రాబోతుంది ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూసుకుంటామన్నారు. మరి పార్లమెంట్ ఎన్నికల రాబోతున్నాయి.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు నిరు పేదల ప్రభుత్వంగా ప్రజల్లోకి వెళ్ళింది అని మంత్రి కొండ సురేఖ పేర్కొన్నారు.కాంగ్రెస్లో చేరిన నాయకులను కార్పొరేటర్లు కొత్త వారిని పాత వారిని రెండు కండ్ల లెక్క చూసుకుంటాను అని మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. ఎవరు భయపడొద్దు.. ఈ క్యాంప్ ఆఫీస్ లో అందరికి అందుబాటులో ఉంటాం.. ఈ రోజు తూర్పు ప్రజల కోసం ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగింది అని ఆమె తెలిపారు. ఎలక్షన్స్ అప్పుడు ఎంతగానో మా కార్యకర్తలను భయాందోళన గురి చేసిన కూడా వారు భయపడకుండా మమల్ని గెలిపించుకోవడం జరిగింది అని చెప్పుకొచ్చారు. ఇక, దేవాదాయ శాఖలో ఉన్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది.. వరంగల్ లో ఉన్న ప్రతి దేవాలయాన్ని తీర్చి దిద్దడమే కాకుండా దేవాదాయ భూములను దేవులపై పాస్ పుస్తకాలను ఏర్పాటు చేస్తే మంచిది అన్నారు.

## ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం అందించాలి..



పెద్దపల్లి : రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి సాగునీరు అందించక కర్షకుల ప్రాణాలను బలిగొంటున్నదని మాజీ మంత్రి, పెద్దపల్లి భారాసా ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. బుధవారం పెద్దపల్లి మండలం చీకురాయిలో ఎండిన వరి పొలాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతు ప్రభుత్వమని చెప్పి రైతులను ఆగం చేస్తున్నదన్నారు. ఎండిపోయిన పంటలకు రైతులకు ఎకరాకు 25వేల రూపాయల పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతులను మోసగించిన కాంగ్రెస్ కు పార్లమెంట్ ఎన్నికలు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. రైతులు అన్నమో రామచంద్ర అంటున్న ప్రభుత్వానికి కనికరం లేదన్నారు.రైతులు సచ్చిపోతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, రైతుల బాధలు చూస్తుంటే గుండె తరుక్కుపోతుందన్నారు.

యాసంగి పంటలకు సాగునీళ్లు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో 50 టీఎంసీల నీళ్లు సముద్రంలో కలిశాయన్నారు. ఎన్నికలకు ముందు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అరచేతిలో వైకుంఠం చూపిందన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ వద్ద మూడు పిల్లర్లు కుంగితే దానిని సాకుగా చూపించి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను ఎండబెట్టి, సాగునీళ్లు ఇవ్వకుండా రైతులను కన్నీరు పెట్టిస్తోందన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే వంద మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు క్వింటాలుకు 500రూపాయల బోనస్ ఇవ్వాలన్నారు. రైతుభరోసా పథకం ద్వారా రైతులకు ఎకరాకు రూ. 15,000ల సాయం, 2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. రైతులను కన్నీరు పెట్టిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులుండవన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధుకర్, మాజీ గ్రంథాలయ చైర్మన్ రఘువీర్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

## అధికారం,ఆస్తుల కోసమే కాంగ్రెస్‌లోకి రంజిత్ రెడ్డి..



హైదరాబాద్ : ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయను.. రాజకీయాల నుంచి తప్పుకుంటానని చెప్పిన చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి.. కేవలం అధికారం, ఆస్తుల కోసమే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారని కేటీఆర్ పేర్కొన్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కేటీఆర్ సమావేశమై, లోక్‌సభ ఎన్నికలపై చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రంజిత్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ టికెట్ ఇచ్చి గెలిపించుకున్న తర్వాతనే, ఆయన ఎవరో ప్రపంచానికి తెలిసిందన్నారు. 2019లోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. అయినా కూడా ప్రతి కార్యకర్త కష్టపడి గెలిపించారని గుర్తు చేశారు. రంజిత్ రెడ్డికి రాజకీయంగా పార్టీలో అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో కూడా ఆయనకు స్వేచ్ఛ ఇచ్చామని తెలిపారు. రంజిత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేశారు. పార్టీ సీనియర్ నాయకురాలు కవిత తన సోదరి అని చెప్పుకునే రంజిత్ రెడ్డి.. ఆమెను అరెస్టు చేసిన రోజే నవ్వుకుంటూ కాంగ్రెస్ పార్టీలో చేరిన స్వార్థపరుడు అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ శ్రేణులే కాదు.. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు కూడా రంజిత్ రెడ్డికి పార్టీ ఏం తక్కువ చేసిందని, పార్టీకి మోసం చేసి వెళ్ళాడు అని చర్చించుకుంటున్నారని కేటీఆర్ తెలిపారు.

### అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరు..

గతంలో ఎన్నికలకు ముందు అప్పటి మాజీ ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి కూడా పార్టీ కన్నా తానే ఎక్కువ అనుకొని ఇతర పార్టీలోకి వెళితే ఫలితం ఏమైందో అందరికీ తెలుసు. ఒక పార్టీ కన్నా తానే పెద్ద అనే అహంకారం ఉన్న వ్యక్తులు రాజకీయాల్లో గెలవరు. అదే నిజమైతే దేశంలో పార్టీలు ఉండవు. స్వతంత్ర అభ్యర్థులే గెలుస్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రంజిత్ రెడ్డి మనసులు కలిసినంత మాత్రాన మిలాఖత్ అయినంత మాత్రనా.. కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో కలిసిపోతాయనుకోవడం వారి రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం. ఎంపీ ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీలో తీవ్రమైన అయోమయం నెలకొని ఉంది. చేవెళ్లలో కాంగ్రెస్ పార్టీకి కనీసం అభ్యర్థి కూడా దొరకలేదు. సొంతంగా అభ్యర్థి లేని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో గెలవడం అసాధ్యం అని కేటీఆర్ పేర్కొన్నారు.

### కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు సులభం..

సామాజిక సమీకరణాల రీత్యా బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు సులభం అవుతుందని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు విశ్వాసం వ్యక్తం చేశారు. కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజులతోపాటు బీసీల కోసం కొన్ని దశాబ్దాలుగా అండగా నిలబడిన వ్యక్తి. ఒకవైపు బీసీల కోసం పాటుపడుతూనే, మరోవైపు అన్ని సామాజిక వర్గాలను, మైనార్టీలను కలుపుకుపోయిన మంచి మనిషి, నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ అని పేర్కొన్నారు.

## రాజన్న క్షేత్రంలో శివ కళ్యాణ మహోత్సవాలు



వేములవాడ :వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో శివ కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇవాల్టి నుంచి ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. అన్ని శివాలయాల్లో శివరాత్రి రోజున శివ కళ్యాణం జరిగితే వేములవాడలో మాత్రం కామ దహనం అనంతరం త్రిరాత్రి ఉత్సవాలు నిర్వహించిన తర్వాత శివ కళ్యాణం నిర్వహించడం అనవాయితీగా వస్తోంది. ఇక, ఈ ఆలయంలోని స్వామి వారి కళ్యాణ మండపంలో ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమశంకర శర్మ నేతృత్వంలో అర్చకులు స్వస్తి పుణ్యహవాచనంతో ఉత్సవాలు వేద మంత్రాలతో ప్రారంభమయ్యాయి. పంచగవ్య మిశ్రణము, దీక్షాధారణము, ఋత్విక్ వరణము, మంటప ప్రతిష్ట, గౌరి ప్రతిష్ట, నవ గ్రహ ప్రతిష్ట, అంకురార్పణ, వాస్తు హెూమం, అగ్ని ప్రతిష్టతో పాటు శ్రీ స్వామివారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంతో పాటు వేద పారాయణములు, పరివార దేవతార్చనలు నిర్వహించారు. శుక్రవారం నాడు అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీ స్వామివారి కళ్యాణ మంటపంలో శ్రీ పార్వతి రాజరాజేశ్వర స్వామి వారల దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది.అయితే, రేపు జరిగే శివ కళ్యాణాన్ని తిలకించేందుకు చైర్మన్ చాంబర్ ముందు ప్రత్యేకంగా కళ్యాణ మంటపం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని రంగు రంగుల పూలతో అందంగా అలంకరించారు. గోపురాలను విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. అలాగే ప్రత్యేకంగా చలువ పందిళ్ళు, తాగునీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు.

### తెలంగాణ ఆర్టీసీలో 3000ఉద్యోగాలు

హైదరాబాద్,ఆర్టిసి త్వరలో మరో 200 కొత్త ఆర్టిసి బస్సులను ప్రారంభించనుంది. అలగే, లోక్ సభ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆర్టిసిలో 3 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. జహీరాబాద్ పర్యటన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అవినీతి పునాదులపై నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన 100 రోజుల్లోనే కుప్పకూలిపోతుందని ఆయన విమర్శించారు. తెలంగాణలో నియంతృత్వానికి వ్యతిరేకం గా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని మతాలు, కులాలను గౌరవిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## గెలుపు మనదే..మళ్లీ గెలిచేది కేసీఆరే..



హైదరాబాద్,ఈ సారి గెలుపు మనదే.. మళ్లీ గెలిచేది కేసీఆరే అంటూ మాజీ మంత్రి మల్లారెడ్డి పేర్కొన్నారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలు గెలుస్తామని అంటున్నారని వాళ్లు చేసిందేమీ లేదని దుయ్యాబట్టారు. మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు.మొన్న ఎన్నికల్లో ఎందుకు కాంగ్రెస్ కు ఓటు వేశామో అని ప్రజలు అనుకుంటున్నారు అని మల్లారెడ్డి అన్నారు. మల్కాజ్ గిరి పార్లమెంట్ లో వాళ్ళకి క్యాడర్ లేదని, ఏం మొహం పెట్టుకొని వాళ్లు ఓట్లు అడుగుతారు అని ఆయన మండిపడ్డారు. గ్యాస్ సిలెండర్ ధర 1200 రూపాయలకు పెంచి పేదలను దోచుకుంటున్నారు.. దేశ ప్రజలను జాతీయ పార్టీలు మోసం చేశాయని మల్లారెడ్డి అన్నారు. హైదరాబాద్, మల్కాజ్ గిరిలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలే గెలిచారు.. ఊర్లలో మాత్రమే బీఆర్ఎస్ ఓడిపోయింది.. హైదరాబాద్‌లో గెలవడానికి కారణం కేటీఆర్ చేసిన అభివృద్ధి.. ప్రతిపక్షాలకు ఓటు బ్యాంక్ లేదు.. ఎండాకాలం వస్తే నిండు కుండల చెరువులు, ప్రాజెక్టులు ఉండే.. కానీ ఇప్పుడు ఎండిపోయినాయి.. మళ్ళీ కేసీఆర్ అధికారంలోకి రావాలి, ప్రాజెక్టుల్లో నీళ్ళు రావాలి అని ఆయన పేర్కొన్నారు. గెలుపు మనదే.. మళ్లీ గెలిచేది కేసీఆరే అని మాజీ మంత్రి మల్లారెడ్డి తెలిపారు.

### నాలో ఏ మాత్రం జోష్ తగ్గలే

నాలో ఏ మాత్రం జోష్ తగ్గలేదని. మునపటిలానే ఉన్నానని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్, గజ్వేల్ రెండు చోట్ల ఓడిన ఈటల రాజేందర్ మల్కాజ్ గిరిలో ఎలా గెలుస్తాడన్నారు. మల్కాజిగిరిలో మాకు తప్ప ఎవరికీ కేడర్ లేదని తనదైన శైలీలో వ్యాఖ్యానించారు పార్లమెంట్ మల్కాజిగిరిలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని మాజీ మంత్రి జోస్యం చెప్పారు. కాగా, ఇటీవల మలారెడ్డి అల్లుడు, ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి కాలేజీలు కూలగొట్టడం.. మల్లారెడ్డి 18 యూనివర్శిటీలో, విద్యార్థుల నిరసన వంటి వివాదాలతో మల్లారెడ్డి కాస్త ఇబ్బంది పడ్డాడు. మరోవైపు మల్లారెడ్డి కాంగ్రెస్ లో చేరుతున్నాడనే వార్తలు కూడా వినిపించాయి. అయితే ఆ వార్తలకు చెక్ పెట్టారు మల్లారెడ్డి. తాను బీఆర్ఎస్ లోనే కొనసాగుతానని స్పష్టం చేశారు.

### తెలంగాణలో దంచికొడుతున్న ఎండలు

హైదరాబాద్,తెలంగాణలో ఎండలు దంచికొడుతున్నాయి. రాబోయే ఐదురోజుల్లో ఎండల తీవ్రత మరింత పెరుగుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు పెరిగే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 27 నుంచి 30 వరకు ఆదిలాబాద్, కుమ్రంభీం, నిర్మల్, మంచిర్యాల, జగిత్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్, నల్గొండ, నారాయణపేట, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది.రాగల ఐదురోజుల పాటు రానున్న ఐదు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం వాతావరణ శాఖ అంచనా వేసింది.

## ఢిల్లీని సర్వనాశనం చేయాలనుకుంటున్నారా..?



న్యూఢిల్లీ,ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్ అరెస్టుపై ఆయన సతీమణి సునీత కీలక వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. లిక్కర్ కేసుతో కేజ్రీవాల్ సంబంధం లేదని చెప్పారు. లిక్కర్ స్కాం పరుతో 250కిపైగా దాడులు చేశారని మండిపడ్డారు. ఢిల్లీని సర్వనాశనం చేయాలనుకుంటున్నారా? అని నిలదీశారు. కేజ్రీవాల్ శరీరం జైలులో ఉన్నా.. ఆయన ఆత్మ మాత్రం ప్రజల్లో ఉందన్నారు. లిక్కర్ కేసు డబ్బు ఎక్కడ ఉందో రేపు కోర్టులో దేశ ప్రజలకు కేజ్రీవాల్ చెబుతారని ఆమె తెలిపారు.లిక్కర్ పాలసీ కేసులో కేజ్రీవాల్ కు ఎనిమిదిసార్లు నోటీసులు ఇచ్చింది ఇడి. దీంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. అయితే, దీంట్లో తాము జోక్యం చేసుకోబోమని కోర్టు స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించిన ఇడి అధికారులు..కేజ్రీవాల్ ను అరెస్టు చేశారు. ప్రస్తుతం కేజ్రీవాల్ ఇడి కస్టడీలో ఉన్నారు. రేపటితో కస్టడీ పూర్తి కానుండడంతో ఆయనను ఢిల్లీ రౌస్ ఎవెన్యూ కోర్టులో ఇడి అధికారులు హాజరుపర్చనున్నారు.

## సంపాదకీయం

**గురువారం 28-03-2024**

# కేసులతో విపక్షాల వేట

భారతదేశం అసాధారణమైన పరిస్థితుల్లో పార్లమెంటు ఎన్నికలకు పోతున్నది. రాష్ట్ర ప్రభుత్వాధినేతలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు జైలులో మగ్గుతున్న, అరెస్టు కాబోతున్న భీతావహ పరిస్థితుల్లో నూతన కేంద్ర ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజాస్వామిక కసరత్తు జరుగుతున్నది. జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అరెస్టుకు ముందు రాజీనామా చేస్తే, తాజాగా ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు చేసినా రాజీనామా చేయలేదు. జైలు నుంచే సర్కారును నడుపుతానని తెగేసి చెప్పారు.ఆ మేరకు తన ప్రభుత్వంలోని ఓ మంత్రికి ఢిల్లీ నీటి సరఫరా మెరుగుదలపై ఆదేశాలు పంపారు కూడా. ఇదంతా గమనిస్తే ఎవరికైనా కొంత గందరగోళం కలగడం సహజమే. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దాడులు, అరెస్టులతో విపక్షాలను వెంటాడుతున్న సంగతి తెలిసిందే. అందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీతో పాటుగా ఐటీని బాహాటంగా ఉపయోగించుకుంటున్నది. ఇదంతా అవినీతిని అంతం చేసేందుకని కేంద్రం అంటున్నది. కానీ, కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాలు ప్రశ్నార్థకమవుతున్నాయి. ఢిల్లీ లిక్కర్ స్కాం అనేది విపక్షాలను వేధించేందుకు కేంద్రం చేతిలో ఆయుధంగా మారిందనే విమర్శలు బలంగా వినవస్తున్నాయి.రెండేండ్లయినా ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసు ఎటూ తేలలేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలు సేకరించిన బలమైన సాక్ష్యాలు అంటూ ఏవీ లేవు. కేవలం అరెస్టయినవారి వాంగ్మూలాల ఆధారంగా కేసు ముందుకు సాగుతున్నది. దీనిపై గతంలోనే కోర్టులు నిలదీశాయి. అయినా ఎడతెరిపి లేకుండా దాడులు, అరెస్టులు కొనసాగుతూనే ఉన్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు పెట్టే కేసులపై విశ్వసనీయత చాలా తగ్గిపోయింది. ఈ తరహా కేసుల్లో నేర నిరూపణ జరిగి శిక్షలు పడటం చాలా చాలా తక్కువ.రాజకీయ నాయకులకు సంబంధించి సీబీఐ, ఈడీ దర్యాప్తు చేసిన కేసుల్లో 95 శాతం విపక్షాల పైనే కావడం గమనార్హం. ఇకపోతే మొత్తంగా ఈడీ కేసుల్లో ముగింపునకు చేరినవి 0.5 శాతానికి లోపే. ఈ ధోరణికి టూజీ స్కామ్ అతిపెద్ద ఉదాహరణ. డీఎంకే నేతలు కనిమొళి, రాజా తదితరులపై టూజీ కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఏడేండ్ల కాలయాపన తర్వాత కూడా ఈ కేసులో ఒక్కరికీ శిక్ష పడలేదు. మొత్తం నిందితులందరినీ నిర్దోషులుగా విడుదల చేశారు. కేవలం దర్యాప్తు సందర్భంగా సాక్షులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా చార్జిషీటు రూపొందించారు.తర్వాత సాక్షులు కోర్టు ముందు అవేవీ ఒప్పుకోలేదు. సీబీఐ స్పెషల్ జడ్జి ఓపీ సైనీ ఈ కేసు తీర్పులో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం గుర్తు చేసుకోవాల్సిన అవసరమున్నది. నిందితులు చేశారంటున్న నేరాలకు సంబంధించిన ఆధారాలేవీ కేసులో చూపలేదు. అధికారిక రికార్డుల్లోని అంశాలను తప్పుగా చదవడం, అరకొరగా చదవడం, కొన్నిటిని మింగేయడం లేదా సందర్భ శుద్ధి లేకుండా చేర్చడం ద్వారా చార్జిషీటు తయారుచేశారు అని ఆయన పేర్కొనడం గమనార్హం. ఢిల్లీ లిక్కర్ కేసులోనూ సీబీఐ జడ్జి నాగ్‌పాల్, సుప్రీంకోర్టు ధర్మాసనం సాక్ష్యాధారాల కోసం దర్యాప్తు సంస్థలను నిలదీయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ తరహా కేసుల విశ్వసనీయత, వాటివెనుక గల ఉద్దేశాలు సందేహాస్పదం కావడం సహజమే.అధికార పార్టీ రాజకీయ ప్రయోజనాల సాధనకు కేంద్ర సంస్థలు పనిముట్లుగా మారాయనే అభిప్రాయం దేశంలో అంతకంతకూ బలపడుతున్నది. ముందుగా ఒక ఆరోపణ చేస్తారు, దాడులు జరుగుతాయి. ఆ తర్వాత ఓ నిందితుడు అప్రూవర్‌గానో, మరో రకంగానో వాంగ్మూలం ఇస్తాడు. దాని ఆధారంగా మరికొందరిని నిందితులుగా మారుస్తారు. అనంతరం వారు ఇక దోషులే అన్నట్టుగా సోషల్ మీడియాలో ఊదరగొడతారు. ఈలోగా అరెస్టయిన నాయకులకు ఎంతో నష్టం జరుగుతుంది. అది జైల్లో గడిపిన కాలం కావచ్చు. లేదా రాజకీయంగా వాటిల్లిన నష్టం కావచ్చు, వ్యక్తిగతంగా అనుభవించిన మనోవేదన కావచ్చు.. జరిగిన అన్యాయానికి ఎవరు జవాబు చెప్తారు? ఈ నష్టాన్ని ఎవరు భర్తీ చేస్తారు? ఇవన్నీ సమాధానం దొరకని ప్రశ్నలు. ఈ క్రమం గురించే ప్రముఖ న్యాయవాది కపిల్ సిబల్ సుప్రీం కోర్టు ముందు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్యం అనేది కొన్ని నియమాలకు కట్టుబడి ఆడే ఆట వంటిది. ఎవరైనా నియమాలను ఉల్లంఘిస్తే దానిని తొండాట అంటారు. ఈ తొండాటలో బీజేపీ ఆరితేరినట్టు కనిపిస్తున్నది. రాష్ర్టాల్లోని బీజేపీయేతర ప్రభుత్వాలను చీల్చడం, కూల్చడం లక్ష్యంగా బీజేపీ పావులు కదుపుతున్నది. అందుకు సామ, దాన, భేద, దండోపాయాలను ఉపయోగిస్తున్నది. ఎమ్మెల్యేల కొనుగోలు, చీలికవర్గం సాయంతో ప్రభుత్వం ఏర్పాటు, దారికి రానివారిపైకి కేంద్ర సంస్థలను ఉసిగొల్పడం, దాడులు, అరెస్టులతో వేధించడం, తనవైపు మళ్లినవారిపై దాడులు, కేసులు నిలిపివేయడం వంటి చర్యలు ఇందుకు అద్దం పడుతున్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర, బీహార్ రాష్ర్టాల్లో ప్రభుత్వాల చరిత్ర గమనిస్తే మనకు బీజేపీ వ్యవహారశైలి స్పష్టంగా బోధపడుతుంది. ఈ తతంగమంతా ప్రభుత్వం చెప్తున్నట్టు కేవలం అవినీతిని అంతం చేసేందుకే అనేది నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో, అంత నిజం!

# బీజేపీ ఎంపీ అభ్యర్థుల విజయవకాశాలపై విశ్లేషణ!



అమరావతి,పొత్తులో భాగంగా ఏపీలో బీజేపీకి చాలా మంది ఊహించని విధంగా ఆరు లోక్ సభ స్థానాలు దక్కాయి! అంటే... సుమారు 42 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ ప్రభావం కనిపించబోతోందన్నమాట. ఈ క్రమంలో తాజాగా ఆ ఆరు స్థానాల్లోనూ అభ్యర్థులను కన్ ఫాం చేసింది అధిష్టాణం. ఈ నేపథ్యంలో... ఆ ఆరు స్థానాల్లోనూ స్థానిక పరిస్థితులు, వీరి విజయవకాశాలపై వాటి ప్రభావం మొదలైన విషయాలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి.

అరకు – కొత్తపల్లి గీత!:

వాస్తవానికి కొత్తపల్లి గీతకు ఎస్టీ సామాజికవర్గం ఎప్పుడో దూరం పెట్టేసిందని చెబుతుంటారు. ప్రధానంగా 2014 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలిచిన అనంతరం ఆమె టీడీపీకి జై కొట్టడం, పైగా ఆమె సామాజికవర్గంపై కూడా సందేహాలు తెరపైకి రావడం ఇందుకు కారణంగా తెలుస్తుంది! ఇక్కడ వైసీపీ నుంచి ఎస్టీ వాల్మీకి సామాజికవర్గానికి చేందిన చెట్టి తనూజ రాణికి జగన్ టిక్కెట్ కేటాయించారు. గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ మెజార్టీ 2,24,089 కావడం గమనార్హం!

రాజంపేట – కిరణ్ కుమార్ రెడ్డి:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆఖరి ముఖ్యమంత్రిగా తెలుగువారికి గుర్తిండిపోయిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ప్రస్తుతం తెలంగాణలోనే నివాసం ఉంటున్నారని అంటున్నారు. అయినప్పటికీ ఈయనకు ఏపీలో టిక్కెట్ దక్కింది. కాంగ్రెస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన ఈయన రాజంపేట లోక్ సభ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారు. ఇక్కడ నుంచి ఈయన ప్రత్యర్థి వైసీపీ సిట్టింగ్ ఎంపీ మిథున్ రెడ్డి కావడంతో ఫైట్ పై ప్రత్యేక ఆసక్తి నెలకొంది!

అనకాపల్లి – సీఎం రమేష్:

2020లో టీడీపీ నుంచి బీజేపీలో చేరి రాజ్యసభ ఎంపీగా పదవి పొందిన సీఎం రమేష్ సొంత జిల్లా కడప. కాగా... ఆయన కడప నుంచి వచ్చి తాజాగా అనకాపల్లి లోక్ సభ టిక్కెట్ సంపాదించుకున్నారు. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే... అనకాపల్లిలో స్థానికులకే ప్రథమ ప్రాధాన్యత ఉంటుంది. ఇక్కడ క్యాస్ట్ కంటే స్థానికతకే ఓటర్లు పట్టం కడతారనడానికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. మరి ఈసారి అనకాపల్లి ప్రజానీకం ఆలోచన ఎలా ఉందనేది వేచి చూడాలి!

తిరుపతి – వరప్రసాద్:

ఈ టిక్కెట్ ప్రస్తుతం బీజేపీతో పాటు కూటమిలోనూ ఆసక్తిగా మారింది. నిన్నటివరకూ వైసీపీలో ఉన్న గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్ బీజేపీలో చేరి.. అనూహ్యంగా తిరుపతి టిక్కెట్ దక్కించుకున్నారు. అసలు ఇంతకాలం బీజేపీ నేతలతో ఎలాంటి పరిచయం ఉన్నట్లు కనిపించని ఆయన అనూహ్యంగా ఈ టిక్కెట్ దక్కించుకోవడం గమనార్హం. ఈయన 2014లో తిరుపతి ఎంపీగా వైసీపీ నుంచి పోటీ చేసి 37,425 ఓట్లతో గెలిచారు. ఇక 2019లో ఇక్కడ వైసీపీకి 2,28,376 ఓట్ల మెజారిటీ దక్కింది.

రాజమండ్రి – పురందేశ్వరి:

ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి ఈదఫా రాజమండ్రి ఎంపీగా పోటీ చేయనున్నారు. గత ఎన్నికల్లో విశాఖ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆమెకు... మొత్తం 12,39,921 ఓట్లకు గానూ కేవలం 33,892 (2.73%) ఓట్లు వచ్చాయి. దీంతో ఆమె నాలుగోస్థానానికి పరిమితమయ్యారు. అయితే రానున్న ఎన్నికల్లో ఆమె రాజమండ్రి నుంచి బరిలోకి దిగబోతున్నారు. అయితే... సోము వీర్రాజు కు అనపర్తి అసెంబ్లీ టిక్కెట్ కేటాయిస్తే ఈమె తన నియోజకవర్గానికి మార్చుకునే ఆలోచనలో ఉన్నారనే కథనాలూ తాజాగా తెరపైకి వచ్చాయి! ఇక, 2019 ఎన్నికల్లో ఇక్కడ వైసీపీకి 1,21,634 ఓట్ల మెజారిటీ దక్కింది!

నరసాపురం – శ్రీనివాస వర్మ:

ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో ఈ స్థానం హాట్ టాపిక్ గా మారింది. పార్టీ ఏదైనా నరసాపురం టిక్కెట్ నాదే అని చెప్పుకున్న రఘురామ కృష్ణంరాజుకి కాకుండా.. ఈ టిక్కెట్ అనూహ్యంగా అన్నట్లుగా భూపతిరాజు శ్రీనివాస వర్మకు దక్కింది. పైన చెప్పుకున్న ఐదుగురు అభ్యర్థులూ వలసనేతలైనప్పటికీ... ఈయన మాత్రం మొదటినుంచీ బీజేపీలోనే ఉన్నారు!! ఇక్కడ గత ఎన్నికల్లో వైసీపీకి 31,909 ఓట్ల మెజారిటీ వచ్చింది!

జీవీఎల్ అసంతృప్తి గళం!:

కూటమిలో భాగంగా టిక్కెట్లు దక్కించుకున్న వారి ప్రస్థావన వచ్చినప్పుడల్లా... అసలు సిసలు బీజేపీ నేతలకు కాకుండా.. వలస పక్షులకే టిక్కెట్లు దక్కాయనే మాటలు ఆ పార్టీ హార్డ్ కోర్ కార్యకర్తల నుంచి వినిపిస్తోంది. ప్రస్తుతం ఏపీ బీజేపీని పూర్తిగా వలస నేతలు ఆక్రమించేశారని వారు అంటుంటారు. ఈ క్రమంలో జీవీఎల్ నరసింహరావుకు బీజేపీ ఎంపీ టిక్కెట్ దక్కకపోవడంపైనా తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయని తెలుస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా "జీవీఎల్ ఫర్ వైజాగ్" అంటూ పనులు చేసుకుంటూ, స్థానికంగా పార్టీనీ, కేడర్ నూ బలపరుచుకుంటూ పనిచేసుకుంటున్నట్లు చెబుతున్న జీవీఎల్ కి విశాఖలో హ్యాండ్ ఇచ్చింది బీజేపీ అధిష్టాణం. పోనీ పక్కనున్న అనకాపల్లి అయినా కేటాయించిందా అంటే... కడప నుంచి సీఎం రమేష్ ని తీసుకొచ్చిందనే కామెంట్లు అక్కడ బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో ఆయన కాస్త నిరసన గళం వంటిది వినిపించారు. మూడేళ్ల నుంచి తాను విశాఖలోనే ఉంటూ.. స్థానిక ప్రజలకు చేరువయ్యినట్లు చెప్పిన జీవీఎల్.. అక్కడి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. ఆయా సమస్యలపై పోరాడినట్లు చెప్పారు. అయితే తన నిస్వార్థమైన సేవ వృథా అయ్యిందన్నట్లుగా స్పందించిన ఆయన... త్వరలోనే విశాఖకు వచ్చి, తన అనుచరులతో భేటీ అయ్యి భవిష్యత్ కార్యచరణపై చర్చిస్తానని తెలిపారు. దీంతో... ఈయన ప్రభావం విశాఖ, అనకాపల్లి లోక్ సభ స్థానాలపై పడే అవకాశంపైనా చర్చ నడుస్తోంది.


## వాలంటీర్ సేవలను విమర్శిస్తే సహించను

ఎమ్మిగనూరు,శ్రీకాళహస్తి టిడిపి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను ఎమ్మిగనూరు వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుక ఖండించారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మీడియా సమావేశంలో బుట్ట రేణుక మాట్లాడుతూ బొజ్జల సుధీర్ రెడ్డి వాలంటీర్లుపై చేసిన వ్యాఖ్యలు బాధాకరమని, వాలంటీర్లు

# అవినీతి వ్యతిరేకతతో అందలం ఎక్కిన కేజ్రీ!

జార్ఖండ్:జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్‌కు జరిగిన అవమానమే ఇప్పుడు ఢిల్లీ సిఎం కేజ్రీవాల్‌కు జరిగింది. జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ కూడా ఓ కేసులో ఇడి అరెస్ట్ చేయడంతో సిఎం పదవి కోల్పోయారు. ఆయన ముందే మేల్కొని..ఎన్‌డిఎలో చేరివుంటే ముప్పు తప్పేది. అసోం సిఎం హిమంత బిశ్వ శర్మను అడిగివుంటే సలహా ఇచ్చివుండేవారేమో... అలాకాకుండా ఎవరికి వారు మోడీని ఢీకొంటామంటే..ఏదో ఒక అవినీతి కేసులో అరెస్ట్ కాక తప్పదని హేమంత్ సోరెన్, కేజ్రీవాల్‌ల విషయంలో స్పష్టమయ్యింది. కేజ్రీవాల్‌కు కూడాలిక్కర్ ేకసు మెడకు చుట్టుకుంది. అన్నా హజారే స్ఫూర్తితో అవినీతి రహిత పాలన అంటూ ఓ అలలా దూసుకు వచ్చిన కేజ్రీవాల్ అవినీతి చట్రంలో ఇరుక్కుపోవడం దారుణం కాక మరోటి కాదు. అవినీతికి వ్యతిరేకంగా.. సుపరిపాలన అందిచడమే లక్ష్యంగా.. అన్నాహజారే ఉద్యమంలోంచి పుట్టిన పార్టీగా దేశ ప్రజల దృష్టిలో ఆకట్టుకుంది. చీపురు గుర్తు ఊడ్చేస్తుందని భావించారు. సామాన్యుడి పార్టీగా అవతరించి దేశ రాజకీయాల్లో సంచలనాలు సృష్టించింది ఆమ్ ఆద్మీ పార్టీ. ఢిల్లీలో మూడుసార్లు అధికారంలోకి వచ్చి పట్టు సాధించిన తర్వాత పంజాబ్‌లో అనూహ్య విజయం సాధించి అధికారాన్ని దక్కించుకుంది. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో 12.92 శాతం ఓట్లు, ఐదు ఎమ్మెల్యేలను గెలిచి బీజేపీకి సవాల్ విసిరే స్థాయికి చేరింది. గోవాలో గణనీయ ఫలితాలను అందుకున్నది. జాతీయ పార్టీగా గుర్తింపు సాధించి బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదిగే ప్రయత్నాల్లో ఉంది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో బీజేపీకి ఆమ్ ఆద్మీ పార్టీ కొరకరాని కొయ్యగా మారిపోయింది. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని ఢిల్లీలో చిత్తుగా ఓడించింది.

ఈ నేపథ్యంలో ఆమ్‌ఆద్మీ పార్టీని బీజేపీ పెద్దలు లక్ష్యంగా చేసుకున్నారనే వాదన బలంగా వినిపిస్తున్నది. ఆప్‌ను పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగానే కేంద్రంలోని పెద్దలు పావులు కదుపుతున్నారని, ఈ దిశగానే దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారనే ఆరోపణ ఉంది. అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే ఆప్ ఏర్పడ్డ తరవాత ఢిల్లీలో,పంజాబ్‌లో చరిత్ర సృష్టించారు. అతి తక్కువ సమయంలో దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. దేశం మొత్తం పార్టీని విస్తరించేందుకు ఆప్ అధినేత కేజ్రీవాల్ అడుగులు వేస్తూ వచ్చారు. ప్రాంతీయ పార్టీగా ప్రారంభమై.. తక్కువ కాలంలో జాతీయపార్టీగా ఎదిగింది. పంజాబ్‌లోనూ అధికారం చేపట్టింది. అవినీతి వ్యతిరేక ఉద్యమంతో ఎంత వేగంగా ప్రజలను ఆకట్టుకుందో.. అంతే వేగంగా అవినీతి ఆరోపణల్లో ఆ పార్టీ కూరుకుపోయింది. అథఃపాతాళానికి పోయిందనే చెప్పాలి. నిక్కచ్చిగా ఉండివుంటే కేజ్రీవాల్ ప్రత్యామ్నాయ నేతగా ఎదిగి ఉండేవారు. ఎన్‌డిఎలో చేరినా మంచి అవకాశాలు ఉండేవి. కానీ మొండితనం, ఎవరు చెప్పినా వినని తత్వం, కాంగ్రెస్ పంచన చేరడం వంటివి కూడా ఆయనకు ఓ రకంగా మైనస్‌గా మారాయనే చెప్పాలి. ఇకపోతే లిక్కర్ కేసుతో పాటు, పటు కేసుల్లో ప్రస్తుతం ఆప్ సీనియర్ నేతలంతా జైల్లో ఉన్నారు. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ పరిస్థితి కూడా అక్కడికే దారతీసింది. లిక్కర్ కేసులో ఇప్పటి వరకు ఇడి సమన్లను ఖాతరు చేయకుండా వచ్చారు. అనూహ్యంగా హైకోర్టు అరెస్టను అడ్డుకోలేమంటూ ఉత్తర్వులు ఇవ్వడంతో గురువారం రాత్రి కేజ్రీవాల్‌ను ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అరెస్ట్ చేసింది. న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టిన తరవాత రిమాండ్ విధిస్తే జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి తప్పకపోచ్చు. ఈడీ అరెస్ట్



నుంచి ఉపశమనం పొందేందుకు కేజ్రీవాల్ చివరి వరకు ప్రయత్నించారు. 9 సార్లు దర్యాప్తు సంస్థ సమన్లు జారీ చేసినా విచారణకు హాజరుకాలేదు. రాజకీయ కుట్రలో ఈడీ పావుగా మారిందని ఆప్ ఆరోపిస్తూ వస్తోంది. చివరికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని ఢిల్లీ హైకోర్టు తీర్పునిచ్చిన గంటల వ్యవధిలో ఈడీ అధికారులు కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారు. పలు కేసుల్లో ఆప్ కీలక నేతలు ఇప్పటికే అరెస్ట్ అయి ఏళ్ల తరబడి జైల్లోనే ఉన్నారు. ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీలో అతిషి, రాఘవ్ చద్దా, గోపాల్ రాయ్, సౌరభ్ భరద్వాజ్‌తో సహా మరికొందరు నేతలు మాత్రమే గుర్తింపు గల ముఖాలుగా కనిపిస్తున్నాయి. అయితే ఢిల్లీలో మినహా దేశ వ్యాప్తంగా ప్రభావం చూపే నాయకులు అయితే పెద్దగా లేరనే చెప్పుకోవాలి. ఆప్ ఏర్పాటుకు అన్నా హజారే ఉద్యమంలోనే పునాది పడింది. అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్, కుమార్ విశ్వాస్ వంటివాళ్లు పార్టీ ఏర్పాటులో కీలక భూమిక పోషించారు. మనీష్ సిసోడియా, సత్యేంద్ర జైన్, సంజయ్ సింగ్, సోమనాథ్ భారతి, అతిషి, రాఘవ్ చద్దా, సౌరభ్ భరద్వాజ్ వంటి నేతలు అరవింద్ కేజ్రీవాల్‌కు అండగా నిలిచారు. కుమార్ విశ్వాస్ లాంటి వారు వెనక్కి వెళ్లారు. దేశ ప్రజలు వీరిపై విశ్వాసం ఉంచారు. దీంతో ఆ పార్టీకి దేశ, విదేశాల నుంచి భారీగా నిధులు వచ్చాయి. ఫలితంగా ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చారు. అయితే పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ వ్యవహార శైలి, ఆయన విధానాలపట్ల అసంతృప్తితో కొందరు నేతలు పార్టీని వీడారు. ప్రశాంత్ భూషణ్, కుమార్ విశ్వాస్, జర్నలిస్ట్ అశుతోష్ వంటివారు పార్టీని వీడారు. ఆ తర్వాత ఆప్ అన్ని రాజకీయ పార్టీల వంటిదేననే అభిప్రాయం ప్రజల్లో బలంగా నాటుకుంది. అవినీతికి వ్యతిరేకంగా అడుగుల వేసినా చివరకు అన్నా హజారే కూడా ఆ పార్టీని ఈసడించుకున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ వెలుగులోకి రావడంతో ఆ పార్టీకి అది మాయని మచ్చగా మారింది. ఇప్పుడు అన్నా హజారే అండ కూడా ఆపార్టీకి కానీ, కేజ్రీవాల్‌కు కాని లేదు. అవినీతి వ్యతిరేక ఉద్యమంతో బలంగా ఎదిగిన ఆప్.. అవే అవినీతి ఆరోపణల్లో కూరుకుపోవడం దారుణం కాక మరోటి కాదు. అవినీతి ఆరోపణలతో మొదట సోమనాథ్ భారతిని, ఆ తర్వాత సత్యేందర్ జైన్ జైలుకు వెళ్లారు. ఆ తర్వాత ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అరవింద్ కేజ్రీవాల్ కుడిభుజంగా ఉన్న మనీష్ సిసోడియా తీహార్ జైలులో ఉన్నారు. ప్రస్తుతం అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసింది. ఈ క్రమంలో ఓ రకంగా చెప్పాలంటే బిజెపి వ్యూహం ప్రకారం పావులు కదిపిందనే చెప్పాలి.

# నంద్యాల జిల్లాలో వైఎస్సార్‌సీపీకి మరో షాక్

నంద్యాల,నంద్యాల జిల్లాలో వైఎస్సార్‌సీపీకి మరో షాక్ తగిలింది. నంద్యాల జడ్పీటీసీ సభ్యుడు గోపవరం గోకుల్ కృష్ణారెడ్డి వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ లో చేరారు. గోకుల్ కృష్ణారెడ్డి కి కండువా కప్పి పార్టీలోకి షర్మిల ఆహ్వానించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ కోసం ఎంతో కష్టపడి పని చేశానని.. అయినా గుర్తింపు లేదన్నారు. పార్టీ కోసం చేసిన సేవలకు కనీసం మర్యాద కూడా దక్కలేదన్నారు. వైసీపీ తనపై కక్షపూరితంగా వ్యవహరించిందని.. కాంగ్రెస్ లో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. సొంత ఇంటికి వచ్చినట్లు ఉందని కృష్ణారెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ అభివృద్ధి కోసం కష్టపడతామని.. పార్టీని అధికారంలో తెస్తామని కృష్ణారెడ్డి తెలిపారు. నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి , నంద్యాల జెడ్పీటీసీ గోకుల్ కృష్ణారెడ్డిల మధ్య వర్గపోరు గత కొంతకాలంగా కొనసాగుతోంది. శిల్పా రవి స్థానికేతరుడని.. నంద్యాల టికెట్ తనకే ఇవ్వాలంటూ వైసీపీ పెద్దలను గోకుల్ కోరారు. ఎమ్మెల్యే రవిపై విమర్శలు గుప్పిస్తూ.. హెచ్చరికలు చేయడం చర్చనీయంశంగా మారింది. ఈ క్రమంలో రెండు దశాబ్దాలుగా స్థానికేతరుల కబంధ హస్తాల్లో నలిగిపోతున్న నంద్యాలకు విముక్తి కల్పించాలంటూ గోకుల్ ఇటీవల ఆత్మ గౌరవ ఓదార్పు యాత్రను కూడా చేపట్టారు. అయితే గోకుల్ యాత్రను పోలీసులు అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అరాచకాలన్నీ బయట పెడతానంటూ ఎమ్మెల్యే రవికి బహిరంగంగా వార్నింగ్ కూడా ఇచ్చారు. అయితే ఓదార్పు యాత్రను అడ్డుకున్నప్పటికీ వెనక్కి తగ్గేదే లే అంటూ అనంతరం గోకుల్ మౌనదీక్షకు పూనుకున్నారు. దీంతో మౌనదీక్షను కూడా భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నాలు చేపట్టారు. గోకుల్ స్వగ్రామం భీమవరంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. గ్రామానికి భారీగా పోలీసు బలగాలు చేరుకుంటున్నాయి. మరోవైపు గోకుల్ కార్యాలయం పోలీసుల అధీనంలోకి వెళ్లింది. విషయం తెలిసిన గోకుల్ అభిమానులు భారీగా గ్రామానికి భారీగా చేరుకున్నారు. నంద్యాల – భీమవరం రహదారిలో పోలీస్ చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఎలాగానై మౌనదీక్షను అడ్డుకోవాలని పోలీసులు భావిస్తుండగా.. మౌన దీక్ష చేసి తీరుతానని గోకుల్ తేల్చిచెబుతున్నారు. దీంతో నంద్యాలలో టెన్షన్ వాతావరణం నెలకొంది. కాగా... నంద్యాల వైసీపీ జడ్పీటీసీగా ఉన్న గోకుల్ కృష్ణారెడ్డి వచ్చే ఎన్నికలలో నంద్యాల అసెంబ్లీ టికెట్ ఆశిస్తున్న సంగతి తెలిసిందే. అందుకోసం జనాల్లోకి వెళుతూ.. ఎమ్మెల్యే శిల్పా రవి లక్ష్యంగా విమర్శలు గుప్పిస్తున్నారు. జనాల్లో సింపతి పొందేందుకు లోకల్, నాన్ లోకల్ అని అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. మరోవైపు గోకుల్ కృష్ణారెడ్డిని అడ్డుకునేందుకు ఎమ్మెల్యే శిల్పా రవి గట్టి ప్రయాత్నాలు చేస్తున్నారు. గోకుల్ యాత్ర గురించి సమాచారం అందిన వెంటనే పోలీసులతో బ్రేక్ వేయించినట్లు సమాచారం. దీంతో నంద్యాలలో ఇద్దరు నేతల ఆధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరింది. మొత్తానికి గోకుల్ వైఎస్సార్‌సీపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# వైసీపీలో కష్టపడ్డవారికి గుర్తింపు లేదు

నెల్లూరు,వెంకటగిరిలో వైసీపీ కి భారీ షాక్ తగిలింది. వైసీపీ సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్ రెడ్డి నేతృత్వంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలు వైసీపీ నేతలు, ప్రజలు భారీగా పాల్గొన్నారు. వెంకటగిరి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి వ్యతిరేక వర్గంతో వైసీపీ నేత మెట్టుకూరు ధనుంజయ రెడ్డి భారీ సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిపై రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటానని మెట్టుకూరు ధనుంజయ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వైసీపీలో కష్టపడ్డవారికి గుర్తింపు లేదు వైసీపీ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. నేదురుమల్లిపై కలిమిలి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుభవం లేని వారికి ఎమ్మెల్యే అభ్యర్థి సీటు కేటాయించారన్నారు. మూడు పార్టీలు మారి వైసీపీలోకి వచ్చిన వ్యక్తి నేదురుమల్లి అని విమర్శించారు. పార్టీకోసమో, జగన్మోహన్ రెడ్డి పై అభిమానంతోనో వైసీపీలోకి నేదురుమల్లి రాలేదని.. తన ఉనికి చాటుకోవడం కోసం వైసీపీలోకి వచ్చాడని కలిమిలి రాంప్రసాద్ రెడ్డి విమర్శించారు. కరెక్టుగా 25మంది కౌన్సిలర్ల పేర్లను కూడా నేదురుమల్లి చెప్పలేరన్నారు. కనీసం నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకోవడం తెలియదన్నారు. ప్రెస్‌మీట్ పెట్టి ఎగతాళి చేయడం మాత్రమే నేదురుమల్లికి తెలుసని.. కలిమిలి రాంప్రసాద్ రెడ్డి, మెట్టుకూరు ధనుంజయ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్ రెడ్డిపై సొంత పార్టీ శ్రేణుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇటీవల వైసీపీ సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రేణిగుంట విమానాశ్రయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని నియోజకవర్గానికి చెందిన నేతలు కలిశారు. మంత్రిని కలిసిన వారిలో ఆరు మండలాల సర్పంచులు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, వైసీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు. వెంకటగిరిలో వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లిని మార్చాలని మంత్రి పెద్దిరెడ్డిని వైసీపీ నేతలు కోరారు. నేదురుమల్లికి టికెట్ ఇస్తే వైసీపీకి తాము పని చేయబోమని సదరు నేతలు మంత్రి పెద్దిరెడ్డికి తేల్చి చెప్పారు. నేదురుమల్లికి టికెట్ ఇస్తే నియోజకవర్గంలో వైసీపీకి ఓటమి ఖాయమని స్పష్టం చేశారు. అయితే ఈ అంశంపై సానుకూలంగా స్పందించేందుకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఒక్క రోజు గడువు కోరారు.

# పార్లమెంట్‌కు మాజీ సిఎం కిరణ్ కుమార్

న్యూఢిల్లీ,లోక్ సభ ఎన్నికలకు సంబంధించి ఐదో జాబితాను బీజేపీ అధిష్టానం ఆదివారం రాత్రి విడుదల చేసిన జాఇతాలో మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డికి చోటు దక్కింది. రాజంపేట నుంచి ఆయన పోటీ చేస్తారు. అలాగే బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరి రాజమహేంద్రవరం నుంచి పోటీ పడతారు. ఇక్కడి నుంచి సీటు ఆశించిన మాజీ పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజుకు నిరాశే మిగిలింది. ఏపీలో టీడీపీ, జనసేనతో పొత్తులో భాగంగా బీజేపీకి 6 లోక్ సభ, 10 అసెంబ్లీ స్థానాలు కేటాయించారు. ఈ క్రమంలో రాష్ట్రం నుంచి పోటీ చేసే ఎంపీ అభ్యర్థులను ప్రకటించింది. తెలంగాణలోని రెండు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను ఖరారు చేసింది. రాజమహేంద్రవరం – పురంధేశ్వరి, అనకాపల్లి – సీఎం రమేశ్, అరకు – కొత్తపల్లి గీత, రాజంపేట – కిరణ్ కుమార్ రెడ్డి, తిరుపతి (ఎస్సీ) – వరప్రసాద్, నరసాపురం – శ్రీనివాస్ వర్మకు కేటాయించారు. తెలంగాణలో 2 ఎంపీ స్థానాలకు అభ్యర్థులను బీజేపీ అధిష్టానం ఖరారు చేసింది. వరంగల్ (ఎస్సీ) స్థానానికి ఆరూరి రమేష్, ఖమ్మం నుంచి తాండ్ర వినోద్ రావుకు టికెట్లు కేటాయించారు.ఎట్టకేలకు ఆరూరి రమేశ్ సీటు దక్కించుకున్నారు. కమ్మంలో జలగం ప్రసాదరావు టిక్కెట్ ఆశించారు. మరోవైపు నామా నాగేశ్వర రావు పార్టీలో చేరుతారని, ఆయనకు టిక్కెట్ కేటాయిస్తారని భావించారు.

# ఫోన్ ట్యాపింగ్‌లో పోలీసుల దూకుడు

హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల్లోనైను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో కీలక విషయం బయటికొస్తోంది. ఇప్పటికే ఈ కేసులో ఎస్ఐబీ డీఎస్పీ ప్రణీత్‌రావు, మరో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులు భుజంగరావు, తిరుపతన్నలను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ప్రణీత్‌రావు కస్టడీ ద్వారా కీలక విషయాలను రాబట్టడంలో దర్యాప్తు బృందం దూకుడుగా వ్యవహరిస్తోంది. అయితే ఈ వ్యవహారంలో ఏ1 నిందితుడిగా ఉన్న ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు కోసం పోలీసులు వెతకడం మొదలుపెట్టారు. ఆయన అమెరికాలో ఉండటంతో పోలీసులు ఒకింత కష్టమైంది. తాజాగా అందుతున్న సమాచారం మేరకు ఈ కేసులో బిగ్ అప్డేట్ వచ్చినట్లుగా తెలిసింది. ఈ కేసు వ్యవహారంలో ప్రభాకర్ రావు పోలీసు ఉన్నతాధికారికి టచ్‌లోకి వచ్చినట్లుగా సమాచారం. అమెరికా నుంచి ఓ ఉన్నతాధికారికి ప్రభాకర్ రావు కాల్ చేసినట్లు తెలుస్తోంది. క్యాన్సర్ చికిత్స కోసం తాను అమెరికాకు వచ్చానని.. జూన్ లేదా జులైలో తిరిగి హైదరాబాద్ వస్తానని పోలీసులతో చెప్పారని తెలుస్తోంది. ఆ ఉన్నతాధికారికి ప్రభాకర్ రావుకు మధ్య జరిగిన సంభాషణ ఇప్పుడు లీక్ అయ్యింది. 'ఇప్పుడు ప్రభుత్వం చెబితే మీరు ఎలా పనిచేస్తున్నారో అప్పుడు మేం కూడా ప్రభుత్వం చెబితే పనిచేశాం. ఎంతైనా మనం పోలీసులం.. మనం.. మనం ఒకటి. మా ఇళ్లల్లో ఎందుకు సోదాలు చేస్తున్నారు..?' అని సదరు ఉన్నతాధికారిని ప్రభాకర్ రావు ప్రశ్నించారు. దీంతో ఆయన చెప్పిన మాటలన్నీ విన్న ఆ ఉన్నతాధికారి.. 'మీరు ఏదైనా చెప్పదలుచుకుంటే అధికారిక మెయిల్‌కు పూర్తిగా సమాధానం రాసి పంపండి' అని బదులిచ్చారు. దీనికి స్పందించని ప్రభాకర్ రావు ఫోన్ కట్ చేయడం గమనార్హం. కాగా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌పై కేసు నమోదైన తర్వాత.. తిన్నగా ఆయన అమెరికా వెళ్లిపోయారు. ప్రభాకర్ ఆదేశాల మేరకే హార్డ్ డిస్కులను ప్రణీత్‌రావు ధ్వంసం చేసినట్లు విచారణలో నిగ్గు తేలింది. ప్రస్తుతం వాటిని రికవరీ చేసిన పోలీసులు.. డిస్కుల నుంచి సమాచారాన్ని రిట్రీవ్ చేస్తున్నారు. విపక్ష నేతలు, అధికారులు, ఇతరుల ఫోన్లను అనధికారికంగా ట్యాపింగ్ చేయడానికి ప్రభాకర్‌రావు ఆదేశాలే కారణమని భుజంగరావు, తిరుపతన్న వాంగ్మూలమిచ్చినట్లు సమాచారం. ఈ వ్యవహారం వెనక బీఆర్ఎస్‌కు చెందిన ఓ కీలక నేత ఉన్నట్లు విచారణలో తేలిపోయింది. ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు కీలక నిందితులు విచారణలో చెప్పిన పేరు ప్రభాకర్‌రావు. ఆయన ఆదేశాలతో విపక్ష నేతల ఫోన్లను ట్యాప్ చేసినట్లు అంగీకరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. ప్రభాకర్‌రావు కూడా పాత్రధారి అని దర్యాప్తు అధికారులు ఖరారు చేశారు. సూత్రధారులు ఎవరనేది తెలియాలంటే ప్రభాకర్‌రెడ్డి అరెస్టు కావాల్సిందేనని చెబుతున్నారు. ఆయనను విచారిస్తే ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ల ట్యాపింగ్ చేశారో స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. ప్రధాన సూత్రధారులకు వ్యతిరేకంగా కేసు బలంగా ఉండాలంటే ప్రభాకర్‌రావు వాంగ్మూలం కీలకమని న్యాయనిపుణులు చెబుతున్నారు.

# పార్టీల కలయిక త్రివేణి సంగమం

విజయవాడ : టీడీపీతో కలిసి వెళ్లాలని పార్టీ అధిష్టానం నిర్ణయించిందని, మూడు పార్టీల కలయిక చారిత్రాత్మక అవసరమని అన్నారు బిజెపి ఏపి చీఫ్ పురందేశ్వరి. మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమంగా అభివర్ణించారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో వివిధ రంగాలు, వర్గాలకు చెందిన పలువురు నేడు పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించిన పురందేశ్వరి మాట్లాడుతూ.. ఏపీలోని అరాచక ప్రభుత్వాన్ని గద్దె దించాలని పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకున్నారన్న ఆమె.. పొత్తుల వల్ల పార్టీలో చాలా మంది ఆశావహులకు నిరాశ ఎదురైందన్నారు. అయితే రాష్ట్రంలోని ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పొత్తులు తప్పలేదని అన్నారు..వైసీపీ ప్రభుత్వ వ్యవస్థలను తమ చేతుల్లోకి తీసుకుందని విమర్శించారు. భారీ ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేయించారని ఆరోపించారు. అప్పులు భారీ ఎత్తున చేయడమే కాకుండా సెక్రెటేరియేట్టును, మద్యాన్ని, గనులను, ప్రభుత్వ భవనాలను, భూములను తనఖా పెట్టేశారని విమర్శించారు.. సెక్రెటేరియేట్టును తాకట్టు పెట్టకూడదని రాజ్యాంగంలో ఏమైనా రాశారా? అని ఓ వైసీపీ నేత కామెంట్ చేస్తున్నారని అన్న పురందేశ్వరి . ప్రభుత్వ ఆస్తులను తనఖా పెట్టే అధికారం ఈ ప్రభుత్వానికి ఎక్కడిది..? అంటూ మండిపడ్డారు.వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లోనూ అవినీతి అని ఆరోపించారు.. మహిళల పుస్తెలు తెంపేసి నాసిరకం మద్యం తాగిస్తామనే రీతిలోనే జగన్ వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీలనే సీఎం జగన్.. ఆ వర్గాలకు ఏం న్యాయం చేశారు? అని ప్రశ్నించారు పురందేశ్వరి.. ఎస్సీ, బీసీ, ఎస్టీల నిధులు దారి మళ్లించారని, ఎస్సీ యువకుడిని హత్య చేసిన ఎమ్మెల్సీని సీఎం తన పక్కన కూర్చోబెట్టుకుంటున్నారని గుర్తు చేశారు. ఎస్సీలకు జగన్ చేసిన న్యాయం ఇదేనా..? అని మండిపడ్డారు.ఏపీ అభివృద్ధికి బీజేపీ అంకితమైన పని చేస్తుందని స్పష్టం చేశారు. వైసీపీ నిరంకుశ పాలన చూస్తున్నాం. సీఎం జగన్‌ను గద్దె దించాలంటే మూడు పార్టీల కూటమి.. త్రివేణి సంగమం అనివార్యమన్నారు. బీజేపీ అభ్యర్థులనే కాదు.. కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. మూడు పార్టీల జెండాలు వేరైనా.. అజెండా మాత్రం ఒక్కటేనని.. మూడు పార్టీల కూటమి ప్రభుత్వంలోకి వస్తేనే ఏపీలో రామరాజ్యం వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు పురందేశ్వరి..

ఏప్రిల్ 5 నుంచి బిజెపి ప్రచార భేరి

ఇక వచ్చే నెల 5 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ ప్రచారాన్ని చేపట్టనుంది. ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఎంపీగా బరిలోకి దిగుతున్న రాజమండ్రి నుంచే ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. పార్టీ జాతీయ నాయకులు, కేంద్ర మంత్రులు ప్రచారసభల్లో పాల్గొనేలా టూర్ షెడ్యూల్‌ను ఖరారు చేస్తున్నారు. వీటితో పాటు టీడీపీ, టీడీపీ, జనసేన పార్టీలు కలిపి ఉమ్మడి బహిరంగ సభలు కూడా ఎక్కడెక్కడ నిర్వహించాలనే దానిపై ఆలోచన చేస్తున్నారు.

పదాధికారుల భేటి

దీనిలో భాగం 150 మందితో విజయవాడలో బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశం విజయవాడలో నేడు ప్రారంభమైంది. ఈ సమావేశానికి జాతీయ నాయకులతో పాటు, రాష్ట్ర నేతలు, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు దాదాపు 150 మంది వరకు హాజరయ్యారు. ఈ మీటింగ్‌కు చీఫ్ గెస్ట్‌గా సిద్ధార్థ్‌నాథ్ సింగ్ హాజరైన ఎన్నికలకు సంబంధించి బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాలకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసుకునేలా ట్రైనింగ్ ఇస్తున్నారు. పోటీ చేయబోయే నియోజకవర్గాలకు ప్రత్యేకంగా కొన్ని టీమ్‌లను ఎంపిక చేయనున్నారు. బీజేపీలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్లకు, నియోజకవర్గాలపై పట్టున్న లీడర్లకు ప్రచార బాధ్యతలు అప్పగించనున్నారు.

# పాత చట్టం.. కొత్త సమస్య...

న్యూఢిల్లీ,కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం 2019లో వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని తెచ్చింది. పౌరసత్వ చట్టం, దాని సవరణ చట్టం 2019తోపాటు జాతీయ పౌర పట్టిక, జాతీయ ప్రజా పట్టిక వంటి శాసనాలు, నియమాలు కూడా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చింది. తన ఎన్నికల ప్రణాళిక ప్రకారం పౌరసత్వ చట్టాల్లో ఈ మార్పులు తెచ్చినట్టు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.2014 ఎన్నికల మ్యానిఫెస్టోలోనే, ప్రపంచంలో ఎక్కడైనా వివక్షను ఎదుర్కొంటున్న హిందువులందరికీ భారతదేశం సహజమైన ఆశ్రయం అవుతుందని, వారు శరణార్థులుగా భారతదేశం రావడానికి సదా ఆహ్వానం ఉంటుందని బీజేపీ పేర్కొన్నది. ఫారినర్స్ ఆర్డర్–1948లో 2015 సెప్టెంబర్ 7న చేర్చిన కొత్త నియమాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్‌ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పారసీ, క్రైస్తవ మతస్థులకు ప్రత్యేక మినహాయింపులు ప్రకటించారు. 'పాస్‌పోర్టు రూల్స్–1950'లో 2015, సెప్టెంబర్ 7న చేర్చిన కొత్త ఉప నియమం ప్రకారం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పారసీ, క్రైస్తవ మతస్థులకు ప్రత్యేక మినహాయింపులను చేర్చారు. ఈ రెండు కొత్త మినహాయింపులకూ 2016, జూలై 18న మరొక సవరణ చేస్తూ అఫ్ఘానిస్థాన్ పేరు కూడా చేర్చారు. ఈ మూడు అంశాలకు చట్టబద్ధత కల్పిస్తూ పౌరసత్వ చట్టంలో ప్రవేశపెట్టడానికి పౌరసత్వ సవరణ చట్టం–2019 రూపొందించారు.పౌరసత్వ చట్టం (1955)లో సవరణలను చేస్తూ కేంద్రం శరవేగంగా రూపొందించిన పౌరసత్వ సవరణ బిల్లు (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ బిల్), 2019 డిసెంబర్ 9న లోకసభ ఆమోదం పొందింది. అనుకూలంగా 311 ఓట్లు వస్తే 80 మంది వ్యతిరేకించారు. డిసెంబర్ 11న రాజ్యసభలో కూడా ఈ బిల్లు పాస్ అయింది. 125 ఎంపీలు అనుకూలంగానూ 105 మంది వ్యతిరేకంగానూ ఓట్లు వేశారు. తర్వాత అంతేవేగంగా రాష్ట్రపతి సంతకం చేయడంతో పౌరసత్వ సవరణ చట్టం (సిటిజెన్‌షిప్ అమెండ్‌మెంట్ ఆక్ట్) 2019గా మారిపోయింది. దీనికింద నియమాలు జారీచేయవలసి ఉండింది. న్యాయశాఖ, హోంశాఖ సంయుక్తంగా రూపొందించే నియమాలు, పౌరసత్వ సవరణ చట్టం అమలును నిర్ధారిస్తాయి.చిన్న చట్టం పెద్ద సమస్య: ఈ పౌరసత్వ సవరణ చట్టం (2019) చాలా చిన్నది. ఐదారు సెక్షన్లలో మార్పుచేర్పులు చేసే సవరణ ఇది. సెక్షన్ 2లో పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్థులు 'చట్ట వ్యతిరేక చొరబాటుదారుల' గుర్తింపు నుంచి మినహాయింపు పొందుతారు అనే మార్పును కేంద్రం చేర్చింది. అక్రమ చొరబాటుదారులు అనే నిర్వచనం నుంచి మినహాయింపు ఇవ్వడం వల్ల ఈ మూడు ఇస్లామిక్ దేశాల నుంచి వచ్చే ఆరు మతస్థులకు త్వరగా భారతీయ పౌరసత్వం ఇచ్చే వీలు కలుగుతుంది. ఆరు మతాలను పేర్కొన్నప్పటికీ ఇస్లాం మతం ఈ జాబితాలో లేకపోవడం వల్ల ఈ మూడు దేశాల నుంచి వచ్చే మహ్మదీయులకు త్వరితగతిన పౌరసత్వం పొందే అవకాశం ఉండదు. ఆ మూడు దేశాల నుంచి వచ్చే శరణార్థులకు, వలసదారులందరికీ వర్తించేవిధంగా నియమాలు లేకపోవడం వల్ల, ఈ చట్టం సర్వసమానతా సూత్రానికి, ఆర్టికల్ 14కు విరుద్ధమని విమర్శలు చెలరేగాయి. మన దేశానికి వలసదారులుగా వచ్చే విదేశీయుల్లో ఎవరికి పౌరసత్వం ఇవ్వాలో, ఎవరికి ఇవ్వకూడదో తేల్చుకునే అధికారం తనకు లేదా? అని ప్రభుత్వం వాదిస్తున్నది. ఈ దేశ పౌరులను మత ప్రాతిపదికపై విభజించడం లేదనీ, కనుక ఇది ఆర్టికల్–14కు భంగకరం కాదని కూడా అంటున్నది.1955 పౌరసత్వ చట్టంలో సెక్షన్ 6బీ ని కొత్తగా చేర్చారు. ఈ సెక్షన్ 6 బీ ప్రకారం.. పై విధంగా మినహాయింపు పొందిన మతస్థులు పౌరసత్వం కోసం నమోదు చేసుకున్నప్పుడు పొందే రాయితీలను వివరించింది. సెక్షన్ 7డీలో సవరణ, సెక్షన్ 18లో సవరణ ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా కార్డు కలిగి ఉన్నవారికి ఇచ్చే మినహాయింపు గురించి చెప్తాయి. మూడో షెడ్యూల్లో కొత్తగా చేర్చిన నిబంధన ప్రకారం అఫ్ఘానిస్థాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి వచ్చే హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతస్థుల విషయంలో గతంలోని '11 ఏండ్లకు తక్కువ కాకుండా' అని ఉన్న నిబంధనను 'ఐదేండ్లకు తక్కువ కాకుండా' అని మార్చి, దరఖాస్తు చేసుకోవడానికి ముందు ఐదేండ్లు నివసిస్తే చాలు, పౌరసత్వం పొందే అవకాశం కల్పించారు. మామూలుగా అయితే అసలు చట్టం ప్రకారం.. 11 ఏండ్లు నివసించిన వలసదారులకు మాత్రమే పౌరసత్వం పొందే వీలుంది.వాస్తవంలో ఇది మూడు ఇస్లామిక్ పొరుగు దేశాల నుంచి మన దేశానికి వచ్చే ముస్లింలకు భారత పౌరసత్వం ఇవ్వబోమని నిషేధం విధించడమే అవుతుందని తీవ్ర విమర్శలు వచ్చాయి. పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టే దశలో ఉద్దేశాలు, లక్ష్యాల నివేదికను ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆ విధమైన ప్రకటన చేసింది. ఒకప్పుడు భారతదేశంలో భాగాలై తర్వాత విడిపోయిన పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌లు ఇస్లామిక్ మత రాజ్యాలుగా తమ రాజ్యాంగాల్లో ప్రకటించుకున్నాయి. అక్కడ హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవ మతానికి చెందిన అల్పసంఖ్యాక వర్గాలవారు మెజారిటీ మతస్థుల చేతిలో వివక్షకు, హింసకు గురవుతున్నారని, ఆ మతహింస భరించలేక ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భారతదేశానికి తరలివస్తున్నారని, శరణార్థులై చాలా మంది మన దేశంలో తలదాచుకుంటున్నారని, వారిని పూర్తిస్థాయి పౌరులుగా మార్చేందుకు సత్వర మార్గాలను ప్రవేశపెట్టి వారిని ఆదుకోవడమే ఈ చట్టం లక్ష్యమని ప్రభుత్వం వివరిస్తున్నది.సరైన అనుమతులు లేకుండా ఈ విధంగా వచ్చేవారు 'అక్రమ చొరబాటుదారులు' అనే నిర్వచనం కిందకు వస్తారు. ఈ చట్టసవరణ ద్వారా ఆ నిర్వచనం నుంచి 6 మతాల వలసదారులకు మినహాయింపు ఇచ్చారు. వీరిపైన చట్టపరమైన చర్యలు తీసుకోకుండా ఉండటానికి, వీరికి దీర్ఘకాలిక వీసాలు ఇవ్వడానికి ఇప్పటికే పాస్‌పోర్టు (ఎంట్రీ ఇన్ టు ఇండియా) చట్టం (1920)లోనూ, ఫారినర్స్ చట్టం(1946)లోనూ 2015, 2016లో సవరణలు చేశారు. కానీ, వారికి పౌరసత్వం ఇవ్వడం ఆ సవరణల ద్వారా సాధ్యం కాదు. కనుక ఈ సవరణ చట్టం తేవడం అవసరమని కేంద్ర ప్రభుత్వం వివరించింది. ఈ అన్ని సవరణల ఫలితంగా 2014 డిసెంబర్ 31కి ముందు ఆ మూడు దేశాల నుంచి వచ్చిన ఆ 6 మతాల వలసదారులకు త్వరగా సులభంగా భారత పౌరసత్వం ఇవ్వడానికే ఈ సవరణ తెస్తున్నామన్నారు.ఇస్లామిక్ మత దేశాలుగా ప్రకటించుకున్న అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హిందువులు, ఇతర అల్పసంఖ్యాక వర్గాలవారి జనాభా నానాటికి తగ్గిపోతున్న మాట వాస్తవం. దానికి కారణం వారిపై సాగుతున్న తీవ్ర మత వివక్ష అనడంలో కూడా సందేహం లేదు. అధికారికంగా మత రాజ్యమని ప్రకటించుకున్న ఈ దేశ రాజ్యాంగాలు సెక్యులర్ విలువలను పాటించే అవకాశం ఉంటుందనుకోలేం. హత్యలకు అత్యాచారాలకు, మతమార్పిడులకు గురయ్యే ఈ అల్పసంఖ్యాక వర్గాలకు, ముఖ్యంగా హిందువులకు భారతదేశం తప్ప మరో గత్యంతరం లేదు. అలాంటి శరణార్థులకు ఆశ్రయం కల్పించడం, కావాలంటే పౌరసత్వం ఇవ్వడం నిజంగా మానవతా దృష్టితో కూడుకున్న మంచి పని. ముస్లింలు ఆ మూడు దేశాల్లో మైనారిటీలు కాదనీ, వారి పట్ల మత వివక్ష ఉండే అవకాశమే లేదని ప్రభుత్వం వాదన. అదే నిజమైతే ముస్లింలు శరణార్థులై వచ్చే అవకాశమే లేకపోతే, వారిని ప్రత్యేకంగా మినహాయించి, మిగిలిన ఆరు మతాలవారికే సత్వర పౌరసత్వ సదుపాయం కల్పించడం దేనికి? అది ఇరుగుపొరుగు దేశాల్లో కేవలం మూడు దేశాలకే ఈ సదుపాయాన్ని పరిమితం చేయడం దేనికి? ప్రపంచంలో ఏ దేశం నుంచైనా మత వివక్షకు గురైన మైనారిటీలకు ఆశ్రయం కల్పించాలన్న గొప్ప మానవతావాదం దీని వెనుక




లేదనేది సుస్పష్టం.కనీసం మన అఖండ భారతదేశం నుంచి వేరైన దేశాల నుంచి వచ్చేవారినైనా పూర్తిగా ఆదరిస్తున్నామా? అంటే అదీ లేదు. అఫ్ఘానిస్థాన్‌కు మన దేశంతో సరిహద్దు లేదు. అయినా అక్కడినుంచి వచ్చేవారికి పౌరసత్వ సదుపాయం కల్పిస్తున్నారు. మన దేశపు హద్దులను ఆనుకొని ఉన్న మయన్మార్ నుంచి రోహింగ్యాలు మన దేశంలోకి వలస వస్తూనే ఉన్నారు. సముద్రం విడదీసిన శ్రీలంక నుంచి మతవివక్ష, అంతర్యుద్ధం కారణంగా వేలాదిమంది తమిళులు కూడా మన దేశంలోకి వస్తూనే ఉన్నారు. వారూ హిందువులే కదా. శ్రీలంక పేరును చేర్చకపోవడం ద్వా రా వారికి అవకాశాన్ని తొలగించారు. పాకిస్థాన్ పేరు చేర్చినా, అక్కడ మతహింసకు, వివక్షకు గురైనవారందరికీ ఆశ్రయం కల్పించే మానవత్వం ఉందా అంటే అదీ లేదు. ఎందుకంటే అక్కడ అహ్మదియాలు, షియాలు, సూఫీలు, బలూచీలు ఇంకా అనేక మైనారిటీ తెగలవారున్నారు. అదే విధంగా బంగ్లాదేశ్‌లో ఈ ఆరు మతాల వారే కాకుండా కనీసం 12 గిరిజన తెగలవారు కూడా మతవివక్షకు గురవుతున్నారు. వారికి ఆశ్రయం పౌరసత్వం ఇవ్వరన్న మాట.పౌరసత్వ చట్టం (1955) ప్రకారం శరణార్థులై ఏ దేశాల నుంచి వచ్చినవారైనా సరే, ఏ మతం వారైనా, ముస్లింలైనా సరే, 11 ఏండ్లు ఈ దేశంలో నివసించి ఉంటే పౌరసత్వం పొందడానికి దరఖాస్తు పెట్టుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం కొన్ని షరతులకు లోబడి వారికి పౌరసత్వం ఇవ్వవచ్చు కూడా. ముస్లింలకు పౌరసత్వం ఇవ్వడానికి ఈ సవరణ చట్టం ఒక నిషేధం వంటిదనే విమర్శలకు ప్రభుత్వం ఇస్తున్న సమాధానం ఏమంటే, పౌరసత్వ చట్టం (1955)లో సవరణ పూర్వ నియమాల కింద 'ముస్లిం వలసదారుల'కు కూడా

పౌరసత్వం ఇవ్వచ్చునని.

2014 డిసెంబర్ 31లోగా మన దేశానికి అఫ్ఘానిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి మత వివక్షకు గురై వచ్చిన హిందువులు, క్రైస్తవులు, జైనులు, పార్సీలు, సిక్కులు, బౌద్ధులకు ఐదేండ్ల పాటే నివసించి ఉంటే వారికి పౌరసత్వం ఇస్తామని 2019 సవరణ చట్టం ప్రకటిస్తున్నది. ఈ చట్టాల పదాల్లో, వాక్యాల్లో, మినహాయింపుల్లో కనిపించని పథకాలు ఏవైనా ఉన్నాయా?మనం కేవలం రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వాన్ని నడపాలి. రాజ్యాంగాన్ని మార్చుకోవచ్చు. కానీ మౌలిక లక్షణాలను సవరించడానికి వీల్లేదు. కేశవానంద భారతి కేసులో 13 మంది న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పుతో 50 ఏండ్లుగా ఈ రాజ్యాంగ బేసిక్ స్ట్రక్చర్‌ను (మౌలిక లక్షణాలు) కాపాడుకుంటూ వస్తున్నాం. బేసిక్ స్ట్రక్చర్ అంటే అపార్టుమెంట్‌లో కీలకమైన స్తంభాలు మార్చడానికి వీల్లేదు. ఆ విధంగా మార్చితే భవనం కూలిపోతుంది. అంటే స్తంభాన్ని మార్చకుండా తలుపులు, కిటికీలు, గోడలు మార్చుకోవడానికి వీలుంది. ఇదే బేసిక్ స్ట్రక్చర్!మాకు అధికారం ఉన్నదని ప్రతి పార్టీ రాజ్యాంగాన్ని మార్చుకుందామనుకుంటే అది సరైన పరిపాలన కాదు. రాజ్యాంగం మౌలిక లక్షణాలను దెబ్బతీసేలా కొత్త చట్టాలను తీసుకురావడానికి వీలు లేదు. ఈ నేపథ్యంలో పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) గురించి ఆలోచించాలి. పౌరసత్వాన్ని సవరిస్తూ 2019లో పలు మార్పులు తీసుకొచ్చారు. అప్పటినుంచి ఐదేండ్ల దాకా ఈ చట్టాన్ని అమలు చేయలేదు, చేయలేకపోయారు. ఈ సవరణ దేశానికి మంచిదని చాలామంది నమ్మడం లేదు. ఇన్నాళ్లు అంటే ఐదేండ్లుగా సీఏఏను అమలు చేయకుండా కేవలం ఎన్నికలకు ముందు ఈ నిబంధనలు తెచ్చారు. అయితే చట్టం ఏం చెప్పినప్పటికీ ఆ నియమాల అమలు మాత్రం న్యాయంగా ఉంటుందా, ఉండదా? అనే అనుమానాలు పెరిగిపోయాయి. అందువల్లే నిరసనలు, విమర్శలు, పిల్స్ వేయడం, దిష్టిబొమ్మలు తగలబెట్టడం వంటి ఆందోళనలు! మాకు 400 ఎంపీల సీట్ల కన్నా ఎక్కువగా వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని బీజేపీ నేతలు భయపెడుతున్నారు.పౌరసత్వ సవరణ చట్టం ఈ దేశంలోని ముస్లింల సమస్య కాదు. అది దేశ రాజ్యాంగానికీ, లౌకికవాదానికి, ప్రజాస్వామ్యానికీ ముంచుకొస్తున్న ప్రమాదానికి సంబంధించిన సమస్య. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధమైనది. 2019 పౌరసత్వ సవరణ చట్టం దేశంలోని ప్రజలను విడగొట్టే ప్రమాదం ఉన్నది. కుల, మత, ప్రాంతీయ, భాషా భేదాలకు అతీతంగా దేశ పౌరులందరూ చట్టం ముందు సమానమేనని చెప్తున్న భారత రాజ్యాంగానికి విరుద్ధంగా ఈ చట్టం దేశంలోని కొందరి పట్ల వివక్షను ప్రదర్శిస్తుంది. దీనితోపాటు అసోంలో జారీచేసిన జాతీయ పౌరసత్వ రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ)ను దేశమంతటికీ విస్తరించడానికి చేస్తున్న ప్రయత్నాలు భారతదేశ లౌకిక స్వభావాన్ని మారుస్తాయి. భారతీయులమైన మనం భారతీయులమేనని నిరూపించుకోడానికి ప్రభుత్వం ఏర్పాటుచేసిన క్యూలైన్లలో నిలుచొని పత్రాలు సమర్పించాల్సి వస్తుంది. పత్రాలు లేకపోతే మనమంతా స్వదేశంలో అక్రమ వలసదారులమవుతాం. దీనివల్ల దేశంలోని ముస్లిం ప్రజలే కాకుండా హిందువులు దాదాపు 140 కోట్ల జనాభా తాము భారత పౌరులమేనని నిరూపించుకోవల్సిందేనా? సరైన పత్రాలు లేనివారంతా విదేశీయులుగా ముద్రపడి శరణార్థుల శిబిరాల్లో బతుకాల్సి ఉంటుందా?2019 డిసెంబర్ 11న పార్లమెంటులో ప్రతిపక్షాలన్నీ బహిష్కరించిన తర్వాత ప్రజాస్వామ్యం ఎన్నడూ చూడని రీతిలో ఈ బిల్లును ఆమోదింపజేసుకొని, సాధించుకున్నారు. ముస్లింలను ప్రత్యేకంగా మినహాయించడం వివాదమైంది. ఆ వివాదం వల్లనే దేశవ్యాప్తంగా ఆందోళనలు, సమస్యలు తలెత్తుతున్నాయి. ఢిల్లీలో కూడా నిరసనలు, దిష్టిబొమ్మల దహనం జరిగాయి. అంతేకాదు, ఈ చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో అనేక పిల్స్ దాఖలయ్యాయి. ఢిల్లీలో, పశ్చిమబెంగాల్‌లో భద్రతా సమస్యలు తలెత్తాయి. పోలీసులు మిలిటరీ బలగాలు తనిఖీలు జరపాల్సి వస్తున్నది. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను జాతీయ పౌరుల రిజిస్టర్ (ఎన్‌ఆర్సీ)తో అనుసంధానించడం, కొత్తచట్టంపైనా వ్యతిరేకతకు మరో కారణం.ఈ దేశంలో ఉండేవారు భారతీయ పౌరులా? కాదా? అనేది ఏ విధంగా నిర్ణయిస్తారు? మీరు, మీ తండ్రులు, తాతలు అంతా భారత పౌరులని ఏ విధంగా రుజువు చేయాలి? అనే ప్రశ్నలకు సరైన జవాబులు దొరకడం లేదు. ఇది ప్రధాన సమస్య. దీనివల్ల ఈ దేశంలో ఉన్నవారికి, వేరే దేశం నుంచి వచ్చినవారికి భారత్‌లో పౌరసత్వం పొందాలంటే కావాల్సిన అర్హతలు, ధృవీకరణలు ఎక్కడ దొరుకుతాయి? ఉన్నట్టుండి మా తాత భారత పౌరసత్వం కలిగి ఉండేవాడని రుజువు చేసుకోవడానికి అర్హతలు ఎక్కడ దొరుకుతాయి? ధ్రువీకరణ పత్రాలు ఎక్కడ లభిస్తాయి? ఒకవేళ దొరకకపోతే ఇక్కడ పుట్టినవాడు, తరతరాలుగా ఉన్నవాడు, ఓటింగ్ ఉన్నవాళ్లు కూడా, ఆధార్ ఉన్నా.. పౌరుడు కాదనే అనుమానం వస్తే ఏం చేయాలి?ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఏ పౌరుడికైనా పౌరసత్వాన్ని నిరాకరిస్తే, ఇవ్వబోమని నిర్ణయిస్తే.. ఎక్కడికి వెళ్లాలి, ఏ దేశానికి వెళ్లాలి?

# చుక్కలను తాకుతున్న విద్యుత్ డిమాండ్

హైదరాబాద్, తెలంగాణలో విద్యుత్ అవసరం అనూహ్యంగా పెరుగుతోంది. వేసవి కారణంగా ఇళ్లలో కరెంట్ వినియోగం పెరిగింది. అలాగే యాసంగి పంటలు సాగులో ఉన్నందున కూడా విద్యుత్ వాడకం అధికంగా ఉంది. 24 గంటలు కరెంట్ సరఫరా కోసం రోజుకు రూ.40 కోట్లు వెచ్చించి తెలంగాణ డిస్కంలు అదనంగా భారత ఇంధన ఎక్స్ఛేంజ్(ఐఈఎక్స్)లో కరెంటును కొంటున్నాయి. ఒక్కోరోజు 8 కోట్ల యూనిట్లు అదనంగా కొంటేనే నిరంతర సరఫరా సాధ్యమవుతోంది. తెలంగాణలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఈ నెలలో ఆరు రోజులు 30 కోట్ల యూనిట్లకుపైగా వినియోగం నమోదవడం సరికొత్త రికార్డు. గతంలో అత్యధిక వినియోగం 2023 మార్చిలో 29.7 కోట్ల యూనిట్లుంటే ఈ ఏడాది మార్చి 7, 8, 12, 13, 14, 15 తేదీల్లో రోజుకు 30 కోట్ల యూనిట్లకుపైగా కరెంటు వినియోగమైంది. రాష్ట్ర చరిత్రలో అత్యధిక వినియోగం ఈ నెల 14న 30.85 కోట్ల యూనిట్లుగా నమోదైంది. వాతావరణం చల్లబడటంతో గత రెండు రోజుల నుంచి కొద్దిగా వినియోగం తగ్గడంతో డిస్కంలు ఊపిరిపీల్చుకున్నాయి. కానీ, మరో నెలరోజులు భారీ వినియోగం ఉంటుందని సరఫరాకు ఏర్పాట్లు చేస్తున్నాయి. యాసంగి పంటలు ఏప్రిల్ చివరిదాకా సాగులో ఉంటాయి. వాటి కోతలయ్యే దాకా అధిక వినియోగం ఉంటుందని విద్యుత్ ఇంజినీర్లు చెప్పారు. వినియోగం ఎంత పెరిగినా ఎక్కడా కోతల్లేకుండా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో డిస్కంలు అందుకు అనుగుణంగా ఐఈఎక్స్‌లో భారీగా కొంటున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా ఫిబ్రవరిలో 12,779 కోట్ల యూనిట్ల కరెంటు వినియోగమైందని.. 8 శాతం డిమాండ్ అదనంగా పెరిగిందని కేంద్ర విద్యుత్ శాఖ తెలిపింది. ప్రస్తుత సంవత్సరం(2023–24)లో ఇంకా ఈ నెల మిగిలి ఉండగానే ఫిబ్రవరి ఆఖరు నాటికే మొత్తం విద్యుత్ వినియోగంలో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలతో పోల్చి చూస్తే తెలంగాణ 8వ స్థానంలో ఉందని కేంద్ర విద్యుత్ మండలి(సీఈఏ) తాజా నివేదికలో వెల్లడించింది. అత్యధికంగా మహారాష్ట్ర 1,88,164 మిలియన్ యూనిట్లతో అగ్రస్థానంలో ఉండగా ఆ తర్వాత ఉత్తర్‌ప్రదేశ్ 1,37,758, గుజరాత్ 1,33,194, తమిళనాడు 1,13,816, రాజస్థాన్ 97,883, మధ్యప్రదేశ్ 90,819, కర్ణాటక 84,186, తెలంగాణ 76,091, ఏపీ 73,458 మిలియన్ యూనిట్లు వినియోగించాయి.

# విశాఖలో గందరగోళం

విశాఖపట్టణం,అమరావతిలో భూముల పేరుతో ఇన్‌సైడ్ ట్రేడింగ్ జరిగింది కనుక..రాజధానిని వైజాగ్‌కు మార్చాలన్న జగన్ ఆలోచన వెనక కుట్ర దాగి ఉందన్న ఆరోపణలు ఊపందుకున్నాయి. విశాఖలో బలవంతంగా భూములు లాక్కున్నారన్న వార్తలు ఇప్పుడు మెల్లగా బయటకు వస్తున్నాయి. ఇటీవల అక్కడ చేస్తున్న కార్యకలాపాలు, వ్యవహారాలు అన్నీఅ భూమి చుట్టే తిరుగు తున్నాయి. మంత్రులు విశాఖ జపం చేసారు. విశాఖలో సముద్రతీరం, ఎయిర్‌పోర్టు, పెద్ద సిటీ కావడం, అక్కడ ఐటి అభివృద్ధికి అవాకాశాలు ఉండడం వంటివి కూడా జగన్ ఆలోచనకు ప్రేరేపితం కావచ్చు. కృష్ణానది వరదలతో రాజధాని ప్రాంతంలోకి నీరు చొరబడిందని, కొండవీటి వాగు ముంపు ఉందని,ఈ నేపథ్యంలో రాజధాని మార్పుపై చిచ్చు రేపారు. ఆనాటి ప్రభుత్వంలో వారికి వున్న పలుకుబడితో డి పట్టా భూములు, లంకలూ చేజిక్కించుకున్నారన్న ఆరోపణలూ వచ్చాయి. అమరావతిలో వారు లబ్ది పొందారు కనుక ఇప్పటి అధికార పార్టీ నేతలకు, అనుయాయులకు మేలు చేకూర్చడానికే ఈ తాజా తతంగమని అందరూ అనుకున్నారు. పనిలో పనిగా టిడిపి వెనకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులనూ దెబ్బ తీసే లక్ష్యమూ వుండొచ్చు. రాజధాని అన్నది రాష్ట్రానికి పాలనా కేంద్రంగా భాసిల్లాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దేశంలో ఎక్కడా లేని విధంగా మూడు రాజధానుల ప్రకటన అంశాన్ని మంత్రులు, ముఖ్యులూ పదేపదే లేవనెత్తడం వెనుక ఆంతర్యం ఏమిటన్నది చర్చ చేయాలి. రాజధానిని తరలించే కుట్రలో భాగంగానే ఆ ప్రాంతంలో వరద ముప్పును పెంచేందుకు ప్రయత్నించారని టిడిపి అధినేత,మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పార్టీ నేతలూ ఆరోపించారు. దీంతో రాజధాని రగడ మరింత రాజకీయ రంగు పులుముకుంది. రాజధాని విషయంలో వైసిపి పట్టుదల వెనక ఉన్న రహస్యం కూడా బట్టబయలు కావాల్సి ఉంది. అమరావతిపై తాజాగా నీలినీడలు అలుముకోవడంతో విశాఖలో సందడి మొదలైంది. కొందరు అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వారి అనుయాయులు ఆయా గ్రామాల్లోని పెద్దలకు ఫోన్లు చేసి రైతులతో మంతనాలు సాగించారు. గతంలో డబ్బు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోనివారు ఆయా భూ యజమానులతో మాట్లాడడం మొదలుపెట్టారు. ఇలాంటి వాటితో ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ బూమ్ పెరిగింది. విశాఖ ప్రాంత ప్రజలకు రంగుల కలలు చూపించారు. మరోవైపు అమరావతిలో భూములు కొన్నవారికీ, అభివృద్ధి జరుగుతుందన్న ఆశతో పూలింగ్‌లో భూములు ఇచ్చిన వారికీ పీడ కలలతో నిద్ర పోలేని పరిస్థితి ఏర్పడింది. టిడిపి–వైఎస్ఆర్‌సిపి మధ్య రాజకీయ వివాదంలా రాజధాని వ్యవహారం దిగజారడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసింది. పైగా రాజధాని నిర్మాణం విషయంలో చెంబుడు నీళ్లు, కాసింత మట్టి ఇచ్చి చేతులు దులుపుకొన్న కేంద్ర ప్రభుత్వం దీనిని తమకేమీ పట్టనట్టుగా చోద్యం చూసింది. రాజకీయ ప్రయోజ నాలు, రియల్ ఎస్టేట్ మాయాజాలాలు కాకుండా ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇచ్చివుంటే ప్రజలు కూడా నమ్మేవారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు 64వేల స్థలాలను తిరిగిచ్చామని, వాటిలో 43వేల ప్లాట్ల రిజిస్ట్రేషన్లే ఇంత వరకు జరిగాయని, మిగతా స్థలాల రిజిస్ట్రేషన్లను త్వరలో పూర్తయ్యేలా చూస్తామని చెబుతూ వచ్చారు. అయితే, రాజధాని ఎక్కడ ఉండాలా అనే విషయం రాష్ట్రం తేల్చుకోలేక పోయింది. విశాఖను కూడా కార్యక్షేత్రంగా చేసకోలేక పోయింది. కేంద్రం పరిధిలో లేదని కేంద్ర మంత్రులు పలు సందర్భాల్లో పేర్కొనడం మరో మెలిక. అంటే రాష్ట్ర ప్రజలను గందరగోళ పర్చడంలో ఎవరికి వారు తమ పాత్ర పోషించారని చెప్పాలి. కృష్ణా నదికి వరదలొస్తే అమరావతి ముంపునకు గురవుతుందని, రాజధానిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అన్న దగ్గరి నుంచి విశాఖకు రాజధాని తరలింపు వరకు గందరగోళం తొలగలేదు. దీనికితోడు ప్రభుత్వం వైజాగ్‌కు షిఫ్ట్ కావాలన్న పట్టుదలతోనే ఉడికూడా ఆ పనిచేయలేకపోయింది. మొత్తంగా ఈ వ్యవహారంలో జగన్ ఎలాంటి పురోగతి సాధించలేదు. దీనికి ఎన్నికల్లో ఎలాంటి జవాబు ఇచ్చుకుంటున్నారని చూడాలి.

## ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడిగా బాబూమోహన్

హైదరాబాద్, ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడిగా ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబూ మోహన్‌ను ఆ పార్టీ అధినేత కేఏ పాల్ నియమించారు. బాబూ మోహన్ కొద్ది రోజుల క్రితమే ప్రజా శాంతి పార్టీలో చేరారు. బిజెపి పార్టీ పెద్దల వైఖరిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. బీజేపీ పార్టీ తనని తీవ్ర నిర్లక్ష్యానికి గురిచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా బాబూ మోహన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. చివరకు ఆయనకు అందోల్ నుంచి బీజేపీ టికెట్ ఇచ్చింది. ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన దామోదర రాజనరసింహ చేతిలో ఘోరంగా ఓటమి చెందారు. బీఆర్ఎస్ నుంచి చంటి క్రాంతి కిరణ్ రెండో స్థానంలో నిలువగా బాబూ మోహన్ మూడో స్థానానికే పరిమితమయ్యారు.

# పసుపు సేనలో సిగపట్లు ...ఆ ఆరు సీట్లకు జగడాలు



అమరావతి,తాము పోటీ చేస్తున్న 144 నియోజకవర్గాల్లో 138 చోట్ల అభ్యర్థులను ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబు ఓ ఆరు నియోజకవర్గాలను ఎందుకు వదిలేశారు? ఈ స్థానాలను పక్కన పెట్టటంలో ప్రత్యేక వ్యూహం ఉందా? లేక సమర్థులు లభించలేదా? ఆరు సీట్లపై టీడీపీ కసరత్తు ఏంటి? ఆ ఆరు ప్రాంతాల్లో స్లో సైక్లింగ్కు కారణమేంటీ?

మార్పుతోనే అసలు రగడ

టీడీపీ పెండింగ్ పెట్టిన ఆరు స్థానాల్లో దాదాపు నాలుగు చోట్ల సీనియర్ నేతలు టికెట్లు ఆశిస్తుంటే.., అక్కడ ప్రత్యర్థులు బలంగా ఉండటంతో టీడీపీ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరిస్తోంది . ఉత్తరాంధ్రలోని చీపురుపల్లి, భీమిలి.. రాయలసీమలోని అనంతపురం అర్బన్, గుంతకల్లు, ఆలూరు, రాజంపేట స్థానాలను పెండింగ్ లో పెట్టింది. ఈ ఆరు స్థానాల నుంచి టీడీపీ సీనియర్ నేతలు కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, గుమ్మనూరు జయరాం, ప్రభాకర్ చౌదరి తదితర సీనియర్లు టికెట్లు ఆశిస్తున్నారు. ఈ సీనియర్లుగా చెప్పే తమ సొంత నియోజకవర్గాలోనే పోటీ చేస్తామని, ఇతర స్థానాలకు వెళ్లే ప్రసక్తి లేదని భీష్మించటంతో అసలు సమస్య ఎదురైంది. టికెట్ల ఖరారు పెండింగ్ పడింది.

చీపురుపల్లిలో గంటా.. కళా

చీపురుపల్లి నుంచి ఇద్దరిలో ఒకరు పోటీ చేయాలని కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావులకు చంద్రబాబు ఖరాఖండీగా చెబుతుండటంతో ఆ ఇద్దరూ డైలమాలో పడిపోతున్నారు. వాస్తవానికి ఈ ఇద్దరికీ చీపురుపల్లితో పెద్దగా సంబంధాలు లేవు. ఓ విధంగా కళా వెంకట్రావు సోదరుడి భార్య మృణాళిని ఆమె కుమారుడు నాగార్జున గత పదేళ్లుగా చీపురుపల్లి కేంద్రంగా రాజకీయాలు చేస్తున్నారు. ఆ ఇద్దరి వల్ల టీడీపీకి చీపురుపల్లిలో డ్యామేజ్ జరిగిందని పార్టీ హైకమాండ్ కు రిపోర్టు రావడం ఆ నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర రాజకీయాలను శాసిస్తున్న బొత్స ప్రాతినిధ్యం వహించటంతో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నా.రు. గంటా లేదా కళా ఇద్దరిలో ఎవరో ఒకరు చీపురుపల్లిలో పోటీకి సమ్మతిస్తే భీమిలిపైనా సస్పెన్స్ తొలగిపోయే ఛాన్స్ ఉంది. కళా సొంత నియోకవర్గం రాజాం ఎస్సీ రిజర్వు కావడంతో ఆయన మూడు ఎన్నికల్లో ఎచ్చెర్ల నుంచి పోటీ చేశారు. ఇప్పుడు ఆ స్థానాన్ని పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడంతో.. కళాకు ప్రత్యామ్నాయంగా చీపురుపల్లి చూపుతున్నట్లు చెబుతున్నారు. ఇలా చీపురుపల్లిపై సస్పెన్స్ వీడితేనే కళా, గంటా పోటీపైన సస్పెన్స్ వీడే అవకాశం ఉంది.

గుమ్మనూరు గుంభనం

మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం పరిస్థితి గుంభనంగా మారింది. తన సిట్టింగ్ స్థానం ఆలూరు టికెట్ ను నిరాకరించారనే కారణంతో వైసీపీని వీడి టీడీపీలో చేరారు.ఆలూరులో మహిళా నేత, కోట్ల సుజాతమ్మ అభ్యర్థనతో జయరాంకు పక్క జిల్లాలోని గుంతకల్లు సీటు ఇస్తామని హామీ ఇచ్చారుజయరాం కూడా ఇందుకు సిద్ధమే అన్నారు. కానీ, మూడో జాబితా విడుదల చేసినా.. అందులో జయరాం పేరు లేదు. దాంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఆ మూడింట ఊగిసలాట..

ఇక మిగిలిన నియోజకవర్గాల్లో అనంతపురం అర్బన్, దర్శి, రాజంపేట స్థానాలపై మిత్రపక్షాలతో ఊగిసలాట కొనసాగుతోంది. దర్శి స్థానాన్ని మాజీ మంత్రి సిద్ధా రాఘవరావు కుటుంబం టీడీపీ టికెట్ కోసం ప్రయత్నిస్తోంది. ప్రస్తుతం వైసీపీలో ఉన్న సిద్ధా.. దర్శి టికెట్ ఇస్తే టీడీపీలోకి వచ్చేస్తామని సంకేతాలు పంపుతున్నట్లు చెబుతున్నారు.

అనంతపురం కోసం జనసేన పట్టు..

ఇక అనంతపురం అర్బన్ నుంచి సీనియర్ నేత ప్రభాకర్ చౌదరి పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. . ఇక రాజంపేటలోనూ సమర్థుల కోసం అన్వేషణలో భాగంగా పెండింగ్ లో పెట్టినట్లు చెబుతున్నారు. మొత్తానికి ఈ ఆరు సీట్లకు అభ్యర్థుల ఎంపిక అధినేతకు సవాల్ గా మారే పరిస్థితి కనిపిస్తోంది. ఆరు నియోజకవర్గాల్లో నలుగురు సీనియర్ల రాజకీయ భవిష్యత్తు ముడిపడి ఉండటంతో టీడీపీ అధినేత నిర్ణయం ఎలా ఉంటుంది అనేది ఉత్కంఠకు గురి చేస్తోంది.

# వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు



న్యూఢిల్లీ,వేసవి వస్తోందంటే ఏటా నీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. గత యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశ ప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. ఎగువ రాష్ట్రాలే నీటిని ఒడిసి పట్టుకుని దిగువ రాష్ట్రాలకు మొండిచేయి చూపే విధానం పోవాలి. లేకుంటే భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు రాగలవు. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జలవిధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. ఈ సమస్య రాగానే ఉభయరాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని మున్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. అందుకే సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో ప్రస్తుతానికి అమల్లో ఉన్న బచావత్ కేటాయింపులను ప్రాజెక్టులవారీగా, రాష్ట్రాల వారీగా పుఃనపంపిణీ చేయాలని ఏపీ, తెలంగాణలు డిమాండ్ చేస్తున్నాయి. కావేరీ విషయంలో ఇదే జరిగింది. ఇప్పుడు కర్నాటక నీటిని అంతా వాడుకుంటే తమిళనాడు గతేం కానుందన్నది అందరికి తెలిసిందే. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్ధాలకు అడ్డుకట్ట వేయాలి. నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఎపిలో పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాకు తరలించే బృహత్తర పథకం సాగింది. దీంతో ఆ రాష్ట్రంలో కృష్ణాడెల్టాలో సమస్య రాకుండా చూసుకున్నారు. ఇదో ఉదాహరణ మాత్రమే. కేంద్రం వీటిని పరిశీలించి జాతీయ జలవిధానం అనుసరించాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం నిల్వ ఉన్న కృష్ణానీటిని వాడుకునే సందర్భంగా ఇటీవల కృష్ణా యాజమాన్య బోర్డు తీర్పుతో అటు తెలంగాణ, ఇటు ఎపి కొంత అసహనం వ్యక్తం చేశాయి. ఉమ్మడి రాష్ట్రంలో నీరు ఎటు ఎంత పోతున్నదన్న ప్రశ్న ఉత్పన్నం కాలేదు. కానీ విభజన తరవాత ఇప్పుడు లెక్కలు పక్కాగా తీయడంతో తెలంగాణ వాటా దక్కించుకునే స్థితి వచ్చింది. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన పిమ్మట వెలువడిన ఈ తీర్పు మరింత ఎక్కువ స్థాయిలో రెండు రాష్ట్రాలనూ నష్టపరిచే రీతిలో ఉంది. కొత్త రాష్ట్రం ఏర్పడి, నదీజలాల్లో కొత్త వాటాదారు వచ్చినపుడు నదీ జలాల వాటాదారులందరికీ దామాషాగా తిరిగి తమతమ హక్కు లెంతవరకో పునర్నిర్వచించాల్సి ఉంది. అయితే ఇక్కడ ఈ న్యాయన్ని పాటించకుండా పాత రాష్ట్రంలో ఉన్న వాటాను ఇద్దరు పంచుకోవాలని చెప్పడం సరికాదు. ఎగువ రాష్ట్రాలను విడిచిపెట్టి, దిగువ రాష్ట్రాలను పాత లెక్కల్లోనే తేల్చుకోమనడం అన్యాయం కాక మరోటి కాదు. దీనిని పంచుకోవాల్సి వస్తే ట్రిబ్యునల్ అవసరమే లేదు. వర్షపాతం తగ్గి, నదీజలాల లభ్యతలో కొరత ఉండడం సాధారణంగా మారినప్పుడు అందుకు తగ్గట్టుగా న్యాయంగా, స్పష్టంగా పంపిణీ జరగాల్సిన అవసరాన్ని ట్రిబ్యునల్ గమనంలోకి తీసుకున్నట్టు లేదు. ఉమ్మడి ఏపీ విభజనతో నదీ పరీవాహక రాష్ట్రాలుగా ఉన్న మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ, ఏపిలకు సమాన హక్కులు ఉండాలి. నీటి పంపిణీ పంచాయతీ నుంచి మహారాష్ట్ర, కర్నాటకలను ట్రిబ్యునల్ మినహాయించడం సహజ న్యాయ సూత్రాలకు, అంతర్జాతీయ నీటి చట్టాలకు పూర్తి విరుద్ధం. మిగులు జలాలపై దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఏపీకి బచావత్ అవార్డు పూర్తి హక్కులు కల్పించగా బ్రిజేష్ ట్రిబ్యునల్ మిగులు జలాల్లో ఎగువ రాష్ట్రాలకు వాటా ఇచ్చి తన అశాస్త్రీయ విధానంతో ఏపీకి తీరని అన్యాయం చేసింది. ఈ అన్యాయంపై ఇంకా పేచీలు కొనసాగుతున్నాయి. నీటి లభ్యత లేని సమయంలో ఎగువ రాష్ట్రాలు తమకు కేటాయించిన నీటిని వాడుకుంటే కిందికి చుక్కరాదు. దిగువ రాష్ట్రం అనివార్యంగా నష్టపోవాల్సిందే. కొత్తగా తెలంగాణ ఏర్పడ్డ కారణంగా ఇప్పుడు నీటిని అన్ని రాష్ట్రాలు సమానంగా పంచుకునేలా తీర్పు ఉండాలి. అప్పుడే న్యాయం జరగగలదు.

# కమలదళాలు కదులుతున్నాయ్...



హైదరాబాద్, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంలో కమలనాథులు ప్రచారానికి పదును పెట్టారు. నాలుగు జాబితాల్లో 17 మంది అభ్యర్థులను ప్రకటించి ముందుస్తుగా ప్ర జలకు వెళ్లేందుకు బిజెపి అగ్ర నాయకత్వం ప్లాన్ చేస్తోంది. ఈసారి తెలంగాణలో 10 నుంచి 12 సీట్లు గెలుపే లక్ష్యంగా ఎన్నికల పోరుకు కాళ్లు దువ్వుతున్నాయి. అందుకోసం అనుబంధ సంఘాలైన యువ మోర్చా, మహిళ, ఎస్సీ, ఎస్టీ ,ఏబీవీపీ సంఘాల నేతలను రంగంలోకి దించింది. యువ మోర్చా తొలిసారిగా ఓట్లు వేస్తున్న యువతను ఆకట్టుకునే విధంగా, కిసాన్‌మోర్చా రైతులతో, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ మోర్చాలు పేద, మధ్యతరగతి ప్రజలు తమ వైపు తిప్పుకునేందుకు ఆయా వర్గాలతో నిరంతరం సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీకి అధిక ఓట్లు వచ్చేలా సిద్దం చేస్తున్నారు.రెండు రోజుల కితం జరిగిన పదాదికారుల సమావేశంలో పోటీ చేసే అభ్యర్థులతో పాటు జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గాల బాధ్యులకు ప్రజలను ఆకట్టుకునేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను దిశానిర్దేశం చేశారు. ప్రతి పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల కార్యాలయాలు ప్రారంభించాలని, ప్రతి పోలింగ్ బూత్‌లో 370 ఓట్లు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి బూత్‌లో పార్టీ బలాన్ని బట్టి నాలుగు భాగాలుగా విభజించి ఓట్లు రాబట్టుకునే ప్రయత్నాలు చేయాలి. ఎంపీ అభ్యర్థి నేరుగా ప్రతి సమావేశానికి హాజరు కావాలని, అసెంబ్లీలో ఎన్నికల నిర్వహణ కమిటీల సమావేశాలు తరుచు నిర్వహించి, ప్రచార కార్యక్రమాలు వేగవంతం చేయాలని సూచించారు. ఇతర పార్టీలకు చెందిన ఆసమ్మతి నేతలతో పాటు స్దానిక కార్యకర్తలను చేర్చుకునే విధంగా ప్రత్యేకంగా ఒక టీం పనిచేయాలని సూచించారు. అదే విధంగా బూత్ స్థాయిలో పార్టీ పటిష్టతను ప్రతి నాయకుడు తన పోలింగ్ బూత్‌లో కో ఆర్డినేటర్‌గా పనిచేయాలి. నామినేషన్ల దాఖలలోపు బూత్ స్థాయిలో ఓటర్ల జాబితాపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఎన్నికల లోపు ప్రతి ఓటరును కనీసం మూడుసార్లు కలిసే విధంగా రూపొందించబడింది.

టికెట్లు రాని అసమ్మతినేలతో మంతనాలు

పార్టీ కోసం పనిచేస్తున్న కొంతమంది సీనియర్లు ఎంపీ టికెట్లు ఆశిస్తే పార్టీ వారికి కాకుండా ఇతర నాయకులకు ఇవ్వడంతో వారంతా సీనియర్లపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాము పార్టీ నిర్మాణం కోసం శ్రమిస్తే తీరా సమయానికి ఇతర పార్టీ నుంచి వలస వచ్చి నేతలకు రాత్రి రాత్రికే టికెటు ఇవ్వడంపై మండిపడుతున్నారు. ప్రధానంగా నల్లగొండ స్థానం మాజీ ఎమ్మెల్యే సాయిదిరెడ్డి, పెద్దపల్లి సీటును గోమాస శ్రీనివాస్, ఆదిలాబాద్ టికెటు గొడుం నగేష్, నాగర్‌కర్నూల్ పొతుగంటి భరత్ ప్రసాద్, హైదరాబాద్ సీటు కొంపెల్లి మాధవీలత, వరంగల్ స్థానం ఆరూరి రమేష్, జహీరాబాద్ బిబిపాటిల్‌కు ఇవ్వడంపై తనకెంతా సీటు వస్తుందని ప్రచారం చేసుకున్నారు.ప్రచారం కోసం ముందుకు రావడం లేదు. పాత నాయకులకు ఓట్లు పడవని, కొత్త నాయకులను ప్రజలు ఆదరిస్తారని, తమతో పనిలేదని ఆవేదనతో మాట్లాడుతున్నారు. వీరంతా పార్టీకి దూరమైతే ఎంపీ అభ్యర్థులు గెలుపు కష్టమేనని, పాత నాయకులను సమన్వయం చేసుకుని పోవాలని అభ్యర్థులకు హస్తిన పెద్దలు సూచించారు. అందరం కలిసి ఏకతాటిపై పనిచేస్తే విజయం వరిస్తుందని, బేధాభిప్రాయాలు ఉంటే విపక్షాలు గెలుస్తామని, టికెట్లు ఆశించి భంగపడవారికి మూడోసారి అధికారం చేపట్టిన తరువాత నామినేటెడ్ పదవులు కట్టబెడుతామని హామీ ఇస్తున్నారు. ఇప్పటివరకు పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారికి సర్దుబాటు చేసే ప్రయత్నాలు అసమ్మతి నేతల అనుచరులు.

# పెరుగుతున్న విద్యుత్ వినియోగం...



అమరావతి, నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సదరన్ డిస్కం పరిధిలోని ఎనిమిది జిల్లాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాది మార్చితో పోల్చుకుంటే ఈ ఏడాది మార్చిలో యూనిట్లు అధికంగా వినియోగించారు. సదరన్ డిస్కం పరిధిలో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతూ వచ్చాయి. దీంతో ప్రజలు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం పెంచారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే పనిలో ఉన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామీణ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచకపోతే సరఫరాలో ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. గతంలో ఎన్నడూ ఇంతగా వినియోగంలేదని విద్యుత్ శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా బాగానే ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను తగినంతగా పెంచుకోకుంటే అవి తరచూ పేలిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎండ తీవ్రతకు రాష్ట్రం నిప్పులకొలిమిలా మారింది. ఉత్తరాది గాలులతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు వాతావరణం బాగా వేడెక్కింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర వేడి కొనసాగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరో రెండుమూడు రోజులు ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. సూర్యుడు సెగలు కక్కుతుండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఇక ఏప్రిల్,మే నెలల్లో ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ రోడ్లపై జనసంచారం కనిపించట్లేదు. భూగర్భజలాలు అడుగం టడం, భూతాపం పెరిగిపోవడంతో మంచినీటిసమస్య కూడా అధికం అవుతున్నది. బోర్లువేసి నీటిసమస్య కొంత తగ్గించాలని భావించినా ఎంత లోతుకు తవ్వినా నీళ్లు రాని పరిస్థితులు దాపురించాయి. వేసవి తాపంనుంచి ఉపశమనం పొందేందుకు ప్రభుత్వాలపరంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేవు. రాష్ట్రంలోని జలాశయాల్లో కూడా నీటివనరులు వేసవి తాపానికి ఆవిరి అవుతున్నాయి. మండుతున్న ఎండలు అటు శారీరక అస్వస్థతలు పెంచడంతో పాటు ప్రజల దాహార్తిని కూడా పెంచుతున్నాయి. ఉష్ణోగ్రత కు పక్షులు, పశువులు అసువులు బాస్తున్నాయి. ఉదయం పదిగంటలు దాటినప్పటినుంచీ రహదారులన్నీ నిర్మానుష్యం గా మారుతున్నాయి. ఉష్ణోగ్రత ప్రభావం, వడగాడ్పులు తీవ్రతరం కావడంతో రాష్ట్రంలో రేడియేషన్ ప్రభావం కూడా పెరుగుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## ఏప్రిల్ 16 నుంచి ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు

ఒంటిమిట్ట,వైఎస్‌ఆర్ జిల్లా ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 16 నుంచి అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ విజయరామారావు, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శుక్రవారం అధికారులతో కలసి క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించారు. ఏకశిలా నగరం ఒంటిమిట్టలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్సవాలు నిర్వహిస్తోంది.

# కొంప మునుగుతుందా?

అమరావతి : టిడిపి నేతల్లో కొత్త భయం నెలకొంది. ఎన్నికల నిర్వహణ సులువుగా చేసుకోవచ్చునని ఆ పార్టీ అధిష్టానం భావించి బిజెపితో పొత్తు కుదుర్చుకుంది. అయితే ఇప్పుడు ఆ పార్టీ వల్ల తమ కొంప మునుగుతుందేమోనని టిడిపి నేతలు భయపడుతున్నారు. కమలం వల్ల తమకు ఓట్లు పడతాయా? లేదా? అనే ఆందోళనలో ఉన్నారు. కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి రాష్ట్రానికి చేసింది శూన్యమని టిడిపి నేతలు భావిస్తున్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న అంశాలు నెరవేర్చకపోవడం, ప్రత్యేక హోదా ఇవ్వకపోవడం, రైల్వేజోన్ ఊసేత్తకపోవడంతోపాటు విశాఖ స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకోవడంతో రాష్ట్ర ప్రజలు బిజెపిపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని టిడిపి నేతలు ఆందోళనలో చెందుతున్నారు. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన సభలో ఈ అంశాలపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. దీంతో టిడిపి నేతలతోపాటు రాష్ట్ర ప్రజలూ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే వైసిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని ఒక్క మాటా అనకపోవడంతో టిడిపి కార్యకర్తలు గుర్రుగా ఉన్నారు. దీంతో జగన్‌కు మోడీ పరోక్షంగా మద్దతు ఇస్తున్నారనే భావన టిడిపిలో నెలకొంది. అదేవిధంగా మతోన్మాద పార్టీ అనే ముద్ర ఉండటమే కాకుండా ముస్లిములకు వ్యతిరేకంగా ఇటీవల సిఎఎ బిల్లును కూడా అమల్లోకి తీసుకొచ్చింది. ముఖ్యంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు, మేధావులు, తటస్థ వర్గాల ప్రజలు బిజెపిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని చెబుతున్నారు. అయితే బిజెపి పోటీ చేయనున్న 6 లోక్‌సభ స్థానాల పరిధిలోని శాసనసభ స్థానాల్లో టిడిపి అభ్యర్థులు కలిసి ప్రచారం చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో బిజెపిపై ఉన్న కోపంతో తమ పార్టీకి ఓటు వేస్తారా? లేరా? అనే ఆందోళన టిడిపి అభ్యర్థుల్లో నెలకొంది. తిరుపతి, రాజంపేట, నరసాపురం, రాజమండ్రి, అనకాపల్లి, అరకు లోక్‌సభ స్థానాల్లో బిజెపి పోటీ చేయనుంది. ఈ పరిధిలో టిడిపి నుంచి 29 మంది అభ్యర్థులు అసెంబ్లీ బరిలో ఉన్నారు. తిరుపతి లోక్‌సభ పరిధిలో సర్వేపల్లి, సూళ్లురుపేట, గూడూరు, శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాలు, రాజంపేట పరిధిలో రాయచోటి, తంబలపల్లె, పీలేరు, పుంగనూరు, మదనపల్లి నియోజకవర్గాలు, అరకు పరిధిలో కురుపాం, పార్వతీపురం, సాలూరు, అరకు వ్యాలీ, రంపచోడవరం నియోజకవ ర్గాలు, అనకాపల్లి పరిధిలోని పాయకరావుపేట, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల స్థానాలు, రాజమండ్రి పరిధిలో రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, అనపర్తి, గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాలు, నరసాపురం కింద ఆచంట, పాల కొల్లు, ఉండి, తణుకు స్థానాలు ఉన్నాయి. వీటిల్లో మరలా 8 ఎస్‌సి, 5 ఎస్‌టి నియోజకవర్గాలు బిజెపి పోటీ చేస్తున్న లోక్‌సభ స్థానాల పరిధిలో ఉన్నాయి. దీంతో ఈ నియోజకవర్గాల్లోని టిడిపి అభ్యర్థుల్లో ఈ ఆందోళన మరికొంత నెలకొంది.

# వరుణ్‌గాంధీ అడుగులు ఎటు?



న్యూఢిల్లీ, గాంధీ – నెహ్రూ కుటుంబ వారసుడు, బీజేపీ ఎంపీ వరుణ్ గాంధీ రాజకీయ భవిష్యత్తు గందరగోళంలో పడింది. సిట్టింగ్ ఎంపీ అయినప్పటికీ వరుణ్ గాంధీకి బీజేపీ టికెట్ ఇవ్వలేదు. దీంతో ఆయన ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తారని, సమాజ్‌వాదీ పార్టీలో చేరతారని రకరకాల ప్రచారాలు జరుగుతున్నాయి.వరుణ్ గాంధీ కాంగ్రెస్‌లో చేరాలని ఆ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధిర్ రంజన్ చౌదరి ఆహ్వానం పలకడంతో వరుణ్ గాంధీ అడుగులు ఎటువైపు ఉంటాయనేది ఆసక్తికరంగా మారింది.

సంజయ్ గాంధీ కుమారుడైన వరుణ్ గాంధీ మూడుసార్లు ఎంపీగా గెలిచి హ్యాట్రిక్ సాధించారు. అయితే, ఇటీవలి కాలంలో ఆయన యూపీలోని యోగి సర్కార్‌తో పాటు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై వివిధ అంశాల్లో విమర్శలు గుప్పించారు. దీంతో బీజేపీ పెద్దలు ఆయనకు టికెట్ ఇవ్వలేదు.తనకు టికెట్ ఇవ్వకుండా బీజేపీ మోసం చేసిందనే భావనతో వరుణ్ గాంధీ ఉన్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఆయనను పార్టీలోకి రమ్మని ఆహ్వానించింది. వరుణ్‌ది గాంధీ కుటుంబం కావడం వల్లనే బీజేపీ టికెట్ ఇవ్వలేదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి ఆరోపించారు.ఆయన కాంగ్రెస్‌లో చేరితే ఆహ్వానిస్తామని, తామంతా సంతోషిస్తామని వ్యాఖ్యానించారు. కాగా, గతంలో వరుణ్ గాంధీని కాంగ్రెస్‌లోకి తీసుకునే విషయమై రాహుల్ గాంధీ భిన్నంగా స్పందించారు. వరుణ్ గాంధీని తాను కలుస్తానని, ఆలింగనం చేసుకుంటానని, అయితే ఆయన భావజాలాన్ని మాత్రం తాను అంగీకరించనని రాహుల్ స్పష్టం చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com